POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూన్ 2022
వెల - ₹ 30.00
సాయిబాబా
ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 40 సంచిక: 02

సంపుటి:40 జూన్ - 2022 సంచిక:02

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సాయిబాబా

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన

ఏకైక పత్రిక, మన ''సాయిబాబా''

దివ్యజనని పూజ్య గురుపత్ని శ్రీమతి ఎక్కిరాల అలివేలుమంగమ్మ దివ్య ఆరాధనామహోత్సవ ప్రత్యేక సంచిక

సాయి మందిరాలలో నాలుగు హారతులివ్వాలి 03
గుర్వాజ్ఞ 05
శ్రీ సాయిమాస్టర్ ! జై తాయిమాస్టర్ !! 08
"భగవంతునికి చెడు అంటేను, చెడుకు భగవంతుడంటేనూ భయం" 12
మాతృదేవో భవ! 15
మాతృదేవి స్తుతులు 23
మాతృదేవి దివ్య సన్నిధిలో నిత్యసేవలు 27

చిరునామా
SRI MANGA BHARADWAJA TRUST
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad, Telangana - 500068. Phone No. +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapea, Ongole, Prakasam Dt. Andhra Pradesh. Phone No. 08592 233271
www.saibharadwaja.org

చందా వివరములు: విడి ప్రతి – 10.00 ; సంవత్సర చందా – 100.00

సాయి మందిరాలలో నాలుగు హారతులివ్వాలి

~పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ~

శ్రీ సాయి తాము మహాసమాధి చెందిన తర్వాతగూడ అంతకుముందు వలెనే నిత్యజాగరూకులై అప్రమత్తతతో భక్తులను కాపాడుతుంటానని చెప్పారు. ప్రపంచమంతటా లక్షలాది భక్తుల అనుభవం నేటికీ దీనిని నిరూపిస్తున్నది. ఇది శాశ్వతంగా నిత్యసత్యమై నిలుస్తుందని వారి వాగ్దానము. వారు సశరీరులై వున్నప్పటిలాగే నేడుకూడా వారికి, వారి చిత్రపటానికి భేదమే లేదని ఎందరి భక్తుల అనుభవమో నిరూపిస్తున్నది.

అట్టి అనుభవం యింకా కలగని వారి శ్రద్ధాభక్తులలో యింకా లోపమున్నదని అర్థము. వారు సాయిచరిత్ర పారాయణ, వారి లీలాస్మరణ మరింత శ్రద్ధగా కొనసాగిస్తూ, తమకట్టి అనుభవం ప్రసాదించమని హృదయపూర్వకంగా ప్రార్థిస్తూండాలి. ఓరిమితో వేచి వుండాలి. కారణం మన అంతరంగంలో ఒక పరిపాకం వచ్చేలోపలే, అట్టి విశేషమైన అనుభవాలు మనకు ప్రసాదిస్తే చెప్పరాని ఆవేశం మనలో కలిగి మనం అదుపుతప్పి మన జీవితవిధులను, లౌకికజీవితాన్ని తారుమారు చేసుకుని పతనమయ్యే ప్రమాదముంటుంది. నిపుణుడైన వైద్యుడు సకాలంలో మాత్రమే మందిచ్చినట్లు సాయికూడా సకాలంలోనే తగిన అనుభవాలిస్తారు. మనకట్టి అనుభవం ప్రసాదించి తరింపచేయాలన్న ఆతురత మనకంటే వారికే ఎక్కువగా వుంటుంది. తనబిడ్డ వీలైనంత ఎక్కువగా తిని హరించుకోవాలన్న ఆరాటం ప్రతి తల్లికి వున్నట్లు, తాను బోధించిన విద్యనంతటినీ శిష్యుడు శల్యగతం చేసుకోవాలని ప్రతి మంచి ఉపాధ్యాయుడు ఆశించినట్లు.

శ్రద్ధాభక్తులతో హారతులను కొనసాగించని మందిరాలలో క్రమంగా మహిమ లుప్తమవుతుంది. కేవలం భౌతికమైన మందిర వ్యవహారాలు అతిముఖ్యమై, నిర్వాహకుల మధ్య రాగద్వేషాలు బలీయమై, మందిర వాతావరణం కలుషితమౌతుంది.

ఇట్టి పరిపాకం మనలో కలిగించేది మన ఇంటా, స్థానిక సాయి మందిరములోనూ వున్న చిత్రపటాలు - మనకింకా అనుభవం కాకున్నా - వారి ప్రత్యక్ష రూపాలేనని గుర్తుంచుకొని, వారు మన సేవలను ప్రత్యక్షంగా గమనిస్తున్నారన్న గుర్తింపును నిలుపుకునే కైంకర్యమే. వీటిలో అతి బలీయమైనవి హారతులు.

శిరిడీలో సాయి భౌతికంగా మన మధ్య నివసిస్తున్న కాలంలో భక్తులు జరుపుకున్న నాలుగు హారతులు ఆరీతినే ఈనాటికీ కొనసాగుతున్నాయి. అలానే దేశంలో సాయిమందిరాలన్నీ నాలుగువేళలా నిత్య హారతులు జరిపించడం అతిముఖ్యం. ఎంతటి ప్రతిభావంతుడైన గురువైనా, తననుండి శ్రద్ధాసక్తులతో

విద్యను కోరి ఆర్జించగల శిష్యులు లేనప్పుడు వారి జ్ఞానం గుప్తంగా వుండిపోతుంది. అలానే శ్రద్ధాభక్తులతో హారతులను కొనసాగించని మందిరాలలో క్రమంగా మహిమ లుప్తమవుతుంది. కేవలం భౌతికమైన మందిర వ్యవహారాలు అతిముఖ్యమై, నిర్వాహకుల మధ్య రాగద్వేషాలు బలీయమై, మందిర వాతావరణం కలుషితమౌతుంది.

ఆరతులు పాడేటప్పుడు మనము సాయిబాబా యొక్క ప్రత్యక్ష సాన్నిధ్యంలో వున్నామని, వారు మనము పాడే హారతులను, మన భావాలను గుర్తిస్తూ తమ కృపాదృష్టిని తగురీతిన సూర్యకిరణాల్లాగా మన హృదయ కమలాలపై నిలిపి, అవి వికసించేలాగా చేస్తున్నారని గుర్తుంచుకోవాలి. ఉదయ(కాకడ)హారతి పాడేటప్పుడు మన హృదయాలలో అజ్ఞానమనే నిద్రమాటున వున్న సాయిని మనం మేల్కొల్పుతున్నామని గుర్తుంచుకోవాలి. ఈ గుర్తింపురూపంలో

నారద, తుంబురాది మహర్షులు సర్వగతులై ఆయన మేల్కొలుపుకు ఎదురు చూస్తుంటారని దాని భావం. రాత్రి పవళింపు(శేజ్)హారతి పాడేటప్పుడు వారు మన హృదయ మందిరాలలో 'యానిశా సర్వభూతానాం' అన్న భగవద్గీతా శ్లోకంలో చెప్పినట్లు యోగనిద్రలో శయనిస్తారు అని గుర్తుంచుకోవాలి. యోగనిద్ర అంటే ఏమిటో సాయిచరిత్ర చూస్తే బాగా తెలుస్తుంది.

నిత్యం తెల్లవారగానే హారతి అయ్యాక ద్వారకామాయిలో తమచెంత కూర్చున్న భక్తులతో ఆ ముందటిరాత్రి ఆయన ఎక్కడెక్కడి భక్తులను ఏ ఏ ఆపదల నుండి కాపాడినదీ, గతించిన జీవులను ఉత్తమలోకాలకో, లేక జన్మలకో ఎలా తీసుకుపోయిందీ ఆయన వివరించేవారు. కొద్ది కాలంలో అవి యదార్థాలని ఋజువులు భక్తులకు అందేవి. అంటే వారి నిద్ర మన నిద్ర వంటిది కాదు. వారు నిత్య జాగరూకులు. వారు కటికనేలపై పండుకుంటుంటే చూడలేక ఒక చెక్కబల్లనో లేక మంచాన్నో సమర్పింపజూచిన ఒక భక్తునితో, "నా వలె కన్నులు తెరిచి నిద్రించ గలవాడే సన్నని పాతగుడ్డపీలికలతో మసీదుకప్పు నుండి వేలాడదీయబడిన చెక్కపలకపై నిద్రించగలడు. నిత్యమూ నేను నిద్రించేటప్పుడు మహల్సాపతితో మెలకువగా కూర్చుని తన చేతిని నా హృదయంపై వుంచి అక్కడ జరిగే నామస్మరణ గుర్తిస్తూండమని చెబుతాను. కానీ అతడు మధ్యలో నిద్ర తూగుతాడు" అన్నారు. అందుకని పై పరమసత్యము గుర్తుంచుకొనే ఆరతులు పాడుకోవాలి.

ఇలా నాలుగుసార్లు నిత్యమూ వారి ప్రత్యక్ష సాన్నిధ్యము గూర్చి మనకు మనమే గుర్తు చేసుకుంటుంటే క్రమంగా ఆ సత్యం మనకు అనుభవమవుతుంది. దీనికితోడు మనము ఏమి తిన్నా, త్రాగినా, మొదట వారికర్పించి, సేవించాలని కూడా సాయి సూచించారు. భోజన సమయంలో యథాశక్తి సర్వజీవ స్వరూపియైన సాయికని కాకబలి ఇంటి బయట విడిచివచ్చి, మిగిలినది వారి ప్రసాదమన్న భావంతో మనం శ్రద్ధగా భుజించాలి.•

గుర్వాజ్ఞ

~పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ~

('ఆచార్య భరద్వాజ కృతజ్ఞతా మహోత్సవము' సందర్భంగా పూజ్య గురుపత్ని జూలై 2013 సంచికలో వ్రాసిన వ్యాసము పునర్ముద్రితము)

సద్గురువు ఇది చేయమనిగాని, చేయవద్దని గానీ చెప్పినదానిని గురువు యొక్క ఆజ్ఞ అని, లేక గురువు యొక్క ఆదేశమనీ చెబుతారు.

గురువు యొక్క ఆజ్ఞ వాచా కావచ్చు, లేక అనేక విధాలుగా గూడ వుండవచ్చు.

ఈ వాక్కు ద్వారా చెప్పడంలో గూడ గురువు అనేక విధాలుగా చెప్పవచ్చు. నెమ్మదిగా చెప్పవచ్చు. గొణిగినట్లు చెప్పవచ్చు. పెద్దగా ఆజ్ఞాపించినట్లు చెప్పవచ్చు. సౌమ్యంగా చెప్పవచ్చు. కోపంగా గూడ చెప్పవచ్చు. అరచినట్లు చెప్పవచ్చు. సంకేతంగా చెప్పవచ్చు.

ఒక్కొక్కప్పుడు గురువు సంజ్ఞలద్వారా చెప్పవచ్చు. కనుసైగల ద్వారా చెప్పవచ్చు, చేతల ద్వారా చెప్పవచ్చు.

వారి ఆజ్ఞలు కొన్ని కఠినంగా వుండవచ్చు. కొన్ని ఎంతో సులభంగా ఆచరించగలిగేవిగా వుండవచ్చు.

ఆదేశాలు అనేక రకాలు - పనులు చేయమని ఆదేశించడము, సంస్కారాలు మార్చుకోవలసి వచ్చినవాటిని ఆదేశించడము, బలహీనతలను పోగొట్టుకోవలసిన వాటిని ఆదేశించడము మొ॥నవి.

> **సద్గురువులు దృశ్యరూపంలో కొందరికి కనిపించి ఆదేశించవచ్చు. మరికొందరికి స్వప్న దర్శనాల ద్వారా ఆదేశాలను అందించవచ్చు. ఇంకొందరికి ఇతర మహాత్ముల ద్వారా గూడా ఆదేశించవచ్చు. కొందరికి జీవితంలో జరిగే సంఘటనల ద్వారా గూడ ఆదేశాలు లభించవచ్చు.**

ఒక్కొక్కప్పుడు యితరులద్వారా గూడ గురువు ఆజ్ఞాపించడం జరుగుతూ వుంటుంది.

అయితే సద్గురువు అందరికీ ఒకే విధమైన ఆదేశాలనివ్వరు. ఒక్కొక్కరికి ఒక్కొక్క విధమైన ఆదేశాలనిస్తారు. ఒకరికే ఒకసారి ఒకటి చేయమని చెబితే, మరొకసారి అదే చేయవద్దని చెబుతారు గూడ. ఎవరి సంస్కారాలకు తగిన ఆదేశాలనివ్వడం సద్గురువు యొక్క ప్రత్యేకత.

దేహధారియై వున్న సద్గురువు యొక్క ఆదేశాలను ఆచరించడం సులభమేగాని సమాధి చెందిన గురువు యొక్క ఆదేశాలను గుర్తు పట్టేదెలా? గుర్తుపట్టినా ఆచరించడం కష్టమేమోనని కొందరికి అనిపించవచ్చు.

కానీ సశరీరులుగా వున్న గురువు యొక్క ఆజ్ఞలను పాటించడం గూడ అంత తేలికేమీ గాదు. ఎవరు ఏది చేసినా, ఏది మాట్లాడినా తమతమ ఇష్టాయిష్టాలననుసరించే చేస్తుంటారు. అలా ఇష్టాయిష్టాలు పనిచేయడం వల్ల గురువు యొక్క ఆజ్ఞలో గూడ తమకు ఇష్టమైన వాటినే చేస్తుంటారు.

సద్గురువు యొక్క సన్నిధిలో వున్నవారైనా, లేనివారైనా అలాగే ప్రవర్తించడం జరుగుతూ వుంటుంది. గురు సన్నిధిలో

వున్నవారు నిరంతరం ఆయన వల్ల జరిగే లీలలను చూస్తున్నప్పటికీ, ఆయన మహిమ తెలుస్తూ వున్నప్పటికీ ఆయన ఆజ్ఞలను – తమకు ఇష్టంలేని వాటిని – పాటించకపోవడం జరుగుతూ వుంటుంది. కారణం – గురువు గంభీరంగా వుండక మామూలు వ్యవహారాలలోను, కొన్ని సందర్భాలలో యితరుల సలహాలను స్వీకరించేవారుగాను, కొన్ని సందర్భాలలో ఇతరుల మాటలను వినేవారుగాను, ఇంకొన్ని సందర్భాలలో ఏమీ తెలియనివారుగానూ వుండడం వల్ల వారి సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్వము వారి సన్నిధిలో వున్నవారి మనసులలో మరుగున పడిపోతాయి. అందువలన వారికి గురువు పట్ల చనువు ఏర్పడుతుంది.

మొదట్లో వున్న భయము, వినయ విధేయతలు కొరవడతాయి. వారి అంతటి మహనీయులతోనూ మామూలు వ్యక్తులతో వలెనే చనువుగా మాట్లాడడం జరుగుతూంటుంది. అందుకని పెద్ద విషయాలలోనే గాక, చిన్న విషయాలలో గూడ వారి ఆదేశాలను తమ ఇష్టాలకు వ్యతిరేకంగా వుంటే ఆచరించకపోవడం జరుగుతూంటుంది.

అసలు గురువు యొక్క ఆజ్ఞలను ఎందుకు పాటించాలి? అన్నింటినీ పాటించడం అవసరమా?

ఈ ప్రశ్నకు సమాధానం అసలు ఆయనను ఎందుకు ఆశ్రయిస్తున్నామో, సేవిస్తున్నామో తెలిస్తేగాని అర్థంగాదు. ఆయనను ఆశ్రయించినప్పటికీ మనం వారి ఆదేశాలను పాటించకతప్పదు. అలా లౌకిక కోరికలకోసం వారిని ఆశ్రయించినప్పటికీ వారి ఆదేశాలను పాటించలేకపోవడం గూడ మహాత్ముల చరిత్రలలో చూడవచ్చు.

ఏ విషయంలోనైనా విలువ తెలిస్తేగాని దానిని మనస్ఫూర్తిగా పాటించలేము. అలాగే సద్గురువు

యొక్క మహిమ, వారి వాక్కులలోని విలువ, ప్రభావము తెలిస్తేగాని ఆయన ఆజ్ఞలను ఆచరించలేము. వారు మామూలుగా మాట్లాడినట్లు అనిపించిన ఆదేశాలలోనైనా సరే మనకు ఎంతటి శ్రేయస్సు ఇమిడి వుంటుందో మొదటగా మనకు అర్థంకావాలి. అందుకు ఆయన చరిత్రలో మనకు లభించిన సంఘటనలను స్మరించుకోవడం అవసరం. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు నిరంతర సాయిలీలల స్మరణ వల్ల సాయి యొక్క ఔన్నత్యము మనకు అవగతమై ఆయనపట్ల భక్తిశ్రద్ధలు పెరిగి ఆయన మాటలయందు విశ్వాసం పెరుగుతుంది. అప్పుడు అన్ని విషయాలలోనూ ఆయన చెప్పినట్లు ఆచరించగలుగుతాము.

సద్గురువు యొక్క ఆజ్ఞల ప్రకారం నడుచుకుంటే ఎలా వుంటుందో, ఆచరించకపోతే ఎలా వుంటుందో, ఏమి జరుగుతుందో శ్రీ సాయి లీలామృతములో మనకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. సందర్భానుసారంగా మచ్చుకు కొన్నింటిని మనమిక్కడ స్మరించుకుందాము.

సద్గురువు తమ వద్దకు లౌకిక కోరికల కోసం వచ్చేవారికైనా, పారమార్థికత కోసం వచ్చేవారికైనా – వారి కోరికలు తీరుస్తూనే వారి వారి స్థాయిని బట్టి, పరిపాకాన్ని బట్టి వారికి తగిన ఆదేశాలనిచ్చి, వారిని పారమార్థికత వైపుకు తీసుకువెళ్తారు. అదే వారి ప్రత్యేకత.

ఉదాహరణకు మహల్సాపతిని అతను చేసే స్వర్ణకారవృత్తిని మానుకుని, పూజారిగా వుండి, భిక్షాటనతో జీవించమని బాబా ఆజ్ఞాపించారు. అతడలాగే చేసి కృతార్థుడయ్యాడు.

అలాగే హీడాబేగ్ అనునతనిని కణాడ్ సమీపంలోని కంటోన్మెంట్ దగ్గరకు వెళ్ళమని ఆజ్ఞాపించారు. అతడాయన ఆజ్ఞానుసారం ప్రవర్తించి గొప్ప మహాత్ముడుగా రూపొందాడు. ఉపాసనీబాబాను నాలుగు సంవత్సరాల పాటు ఖండోబా ఆలయంలో వుండమనడమేగాక అలా చేస్తే తమ ఆధ్యాత్మిక స్థితినే అతడూ పొందగలడని అభయమిచ్చారు సాయి. కానీ అతడు 3-1/2 సం॥లు మాత్రమే వుండగలిగాడని అతని చరిత్ర చూస్తే తెలుస్తుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ సాయిబాబాను సశరీరులుగా దర్శించలేదు. అయినప్పటికీ బాబా ఆయనకు తమ ఆదేశాలనిచ్చి ఆయన జీవితాన్ని నడిపించారు.

అలాగే ఒకడు తనకు ఆత్మానుభూతిని ప్రసాదించమని ప్రార్థించాడు. ఇప్పుడు సమయం కాదని బాబా ఎంతగా చెప్పినా వినక తనకు అట్టి అనుభూతి అప్పుడే కావాలని పట్టుబడతాడు. బాబా అతనివైపు తమ పిడికిలి విసిరి అట్టి అనుభూతిని అతనికి ప్రసాదిస్తారు. కానీ అట్టి స్థితిని అతడు భరించలేక తిరిగి తీసుకోమని బాబాను ప్రార్థిస్తాడు. బాబా అలానే తిరిగి తీసుకుంటారు.

ఈ విధంగానే బాబా భక్తులు కోరే లౌకికమైన కోరికలను గూడ ఎన్నింటినో తీర్చేవారు. కొన్నింటిని ఆయన ప్రసాదించేటప్పుడు వారికి కొన్ని ఆదేశాలనిచ్చేవారు. కొందరు వాటిని పాటించి శ్రేయస్సును పొందేవారు. వాటిని ఉల్లంఘించిన వారు నష్టపోవడము, ఇబ్బందులు పడడమూ జరిగేది.

ఉదాహరణకు మిల్లు మేనేజరు పదవికి రాజీనామా చేసిన సదాశివ తార్కాడ్ శిరిడీలో కొంతకాలముండి తిరిగి వెళ్ళడానికి బాబాను సెలవు కోరాడు. బాబా అతనిని పూనా మీదుగా వెళ్ళమన్నారు. అట్లా వెళ్తే ఖర్చు ఎక్కువైనప్పటికీ అతడాయన ఆజ్ఞను పాటించాడు. అతనికి



వెంటనే పూనాలో ఉద్యోగం వచ్చింది.

అలాగే ప్రథమంగా దర్శించిన బలరామ్ దురంధర్ కు చిలిం పీల్చమని యిచ్చారు బాబా. తన కలవాటు లేకపోయినప్పటికీ అతడు బాబా ఆజ్ఞను పాటించాడు. అతనిని బాధిస్తున్న ఉబ్బసం అప్పటితో తగ్గిపోయింది.

ఒకసారి నానా చందోర్కర్, దాసగణు శిరిడీ నుండి బయలుదేరి బాబాను సెలవుకోరారు. బాబా వారిద్దరినీ భోజనం చేసి వెళ్ళమన్నారు. కానీ భోజనం చేస్తే రైలు సమయం మించిపోయి రైలు అందదని దాసగణు భోజనం చేయకుండానే బయలుదేరాడు. బాబా చెప్పినట్లు భోజనం చేసి బయలుదేరిన నానా వెళ్ళేవరకూ రైలు రానేలేదు. బాబా మాటను ఉల్లంఘించిన దాసగణు ఆకలితోనే వుండవలసి వచ్చింది.

ఒకసారి ఒక బ్రాహ్మణుడు తన దారిద్ర్యం తీర్చమని బాబాను ప్రార్థించాడు. ఆయన ఒక పొట్లం అతనికిచ్చి, దానిని ఇంటికి వెళ్ళేవరకూ విప్పి చూడవద్దని చెప్పారు. కానీ అందులో ఏముందోనన్న కుతూహలం ఆపుకోలేక మార్గమధ్యంలోనే దానిని విప్పాడు. అందులో మాంసపు ముద్ద ఉండడం గమనించి అసహ్యంతో అతడు దానిని ప్రక్కనున్న కాలువలోకి విసిరేసాడు. అతడు చూస్తుండగానే ఆ మాంసపు ముద్ద బంగారంగా మారి నీటిలో మునిగిపోయింది!

అలానే దీక్షిత్ బాలాభాటే కుమార్తెకు మంచి పెళ్ళి సంబంధం తెస్తాడు. బాబా వద్దంటారు. అయినా అతడు మళ్ళీ మళ్ళీ అడగడంతో బాబా, "అయితే యిచ్చి చేసుకో పో! ఏడ్చుకో!" అంటారు. బాబా ఆదేశాన్ని పట్టించుకోక ఆ పెళ్ళి జరిపిస్తారు. ఆరు నెలలలోపే ఆ పెళ్ళికొడుకు మరణిస్తాడు.

పెద్ద విషయాలలోనే గాదు, చిన్న చిన్న విషయాలలో గూడ ఒక్కొక్కప్పుడు బాబా మాటలు అంతగా పట్టించుకోకపోవడం వల్ల గూడ కొందరు భక్తులు ఇబ్బందులకు గురయ్యేవారు.

ఉదాహరణకు ఒకసారి తాత్యా జజూరి వెళ్ళివస్తానంటే బాబా "ఎందుకంత బాధ! వద్దు", అన్నారు. కానీ అతడు చనువు వల్ల ఆయన మాటలు పట్టించుకోక వెళ్ళి గుర్రపుబండి తలక్రిందులవడం వల్ల దెబ్బలు తగిలి బాధతో వెనుకకు తిరిగి రావలసి వచ్చింది.

అలాగే ఒక మేకను నరకటానికి బాబా కత్తి తెమ్మని చెప్పినప్పుడు, నరకమని ఆజ్ఞాపించినప్పుడు కొందరు అలా చేయకపోవడము, మరికొందరు అలా చేయడానికి సంసిద్ధులవడము బాబా చరిత్రలో చూస్తాము.

దీనిని బట్టి గురువు సశరీరులై వున్నప్పుడు గూడ ఆయన ఆజ్ఞలను పాటించడం అంత తేలిక కాదనిపిస్తుంది. గురువు సశరీరులుగా వున్నప్పుడే వారి ఆజ్ఞలను అమలు పరచడం అంత కష్టమైతే, ఇక సమాధి చెందిన గురువు యొక్క ఆజ్ఞలను పాటించడం ఎలా? అసలు గుర్తు పట్టేదెలా? అని అనిపించవచ్చు.

కానీ సద్గురువులు సమాధి అనంతరం గూడ భక్తులకు ఆదేశాలు అందిస్తూనే వుంటారు. వారు కొందరికి సశరీరులుగా దర్శనమిచ్చి ఆజ్ఞాపిస్తారు. చునీలాల్ ఆశారామ్ భగత్ అనుభవం యిందుకు ఉదాహరణ.

సద్గురువులు దృశ్యరూపంలో కొందరికి కనిపించి ఆదేశించవచ్చు. మరికొందరికి స్వప్న దర్శనాల ద్వారా ఆదేశాలను అందించవచ్చు. ఇంకొందరికి ఇతర మహాత్ముల ద్వారా గూడా ఆదేశించవచ్చు. కొందరికి జీవితంలో జరిగే సంఘటనల ద్వారా గూడ ఆదేశాలు లభించవచ్చు.

పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ సాయిబాబాను సశరీరులుగా

దర్శించలేదు. అయినప్పటికీ బాబా ఆయనకు తమ ఆదేశాలనిచ్చి ఆయన జీవితాన్ని నడిపించారు.

ఉదాహరణకు ఆయన వివాహం విషయంలో ఆయనకు శ్రీ చీరాలస్వామి ద్వారాను, శ్రీ పాకలపాటి గురువుగారి ద్వారా, శ్రీ పురన్దలాయ్ ద్వారా ఆయనను వివాహం చేసుకోవలసిందిగా ఆజ్ఞాపించారు.

అలాగే విద్యానగర్ (నెల్లూరు జిల్లా)లో ఆయన ఉద్యోగం చేస్తున్న సమయంలో ఆయన అక్కడ నుంచి వెళ్ళిపోవలసిన పరిస్థితులు సంభవించాయి. వెళ్ళాలా, వద్దా అని ఆయన ఆలోచిస్తుండగా ఒక వ్యక్తి వచ్చి శిరిడీ ప్రసాదం ఆయన చేతిలో పెట్టి, "ఇక మీరు బయలుదేరవచ్చు" అన్నాడు. అదే బాబా ఆదేశంగా ఆయన స్వీకరించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా అంటారు: "శ్రీసాయి లీలామృతములో శ్రీసాయిబాబా యొక్క లీలలు మనమెప్పుడూ చదువుతూనే వుంటాము. అందుకని అవి మనకు తెలియకపోవడమేమీ లేదు. కానీ వాటిని మన జీవితంలో అన్వయించుకోవడమెలాగో మాత్రమే తెలియడం లేదు. సరిగ్గా తీసుకోగలిగితే మహాత్ముల ద్వారాను, వ్యక్తుల ద్వారాను, సంఘటనల ద్వారాను, పరిసరాల ద్వారాగూడ మనకు ఆయన ఆదేశము, బోధ లభిస్తూనే వుంటాయి"

ఆయన యింకా ఇలా అంటారు: "నిజానికి శ్రీసాయిబాబా సూక్తులన్నీ ఉపదేశాలే, ఆదేశాలే. ఆయన సూక్తులను ఆచరిస్తూ వెళ్తుంటే ఆయన ఆజ్ఞలను పాటించినట్లే. అప్పుడు మనం ఎంతమేరకు ఆయన సూక్తులను ఆచరిస్తామో, అంతమేరకు ఆయన అనుగ్రహం మనకు లభిస్తూ వుంటుంది."

ఇందుకు ఉదాహరణ పూజ్యశ్రీ మాస్టరుగారే! బాబా సూక్తులను ఆయన సంపూర్ణంగా ఆచరించారు.

"పనిచెయ్యి, దేవుని నామము ఉచ్చరించు; సద్గ్రంథాలు చదువు". ఆయన నిరంతరం ఏదో ఒక పని చేస్తూనే వుండేవారు. సద్గ్రంథాలు పఠిస్తూనే వుండేవారు. శ్రీసాయి నామస్మరణ ఆయనకు నిరంతరం జరుగుతూనే వుండేది.

"ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకో, నీ దగ్గరకు ఏ ప్రాణి వచ్చినా ఆదరించు"

ఆయన వద్దకు నిరంతరం ఎంతోమంది సమయాసమయాలు లేకుండా వస్తూనే వుండేవారు. కొందరు కొన్నాళ్ళపాటు, కొన్నేళ్ళపాటు ఆయన సన్నిధిలో వుండేవారు. ఎవరినీ ఆయన నిరాకరించలేదు. అందరినీ ఆదరించారు.

"భూమి విత్తును ధరిస్తుంది, మేఘాలు వర్షిస్తాయి..." అని బాబా చెప్పినట్లు ఆయన ప్రతిఫలాన్ని ఆశించక తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించారు.

"నిన్నెవరైనా ఏమైనా అంటే మాటకు మాట చెప్పవద్దు. ఎవడు నిందను, దూషణనూ సహిస్తాడో వాడు నాకెంతో యిష్టుడు" అన్న సూక్తి ప్రకారం ఎవరు తమను వ్యతిరేకించినా, దూషించినా ఆయన చలించలేదు. ఓర్పుతో సహించారు.

నిజానికి మనము గూడ మన గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారి ఆజ్ఞల ప్రకారమే నడుచుకోవాలని, ఆయన అనుగ్రహానికి పాత్రులము కావాలనే మనస్ఫూర్తిగా కోరుకుంటాము. కానీ ఆయన ఆజ్ఞ ఏమిటో తెలుసుకోలేకపోతాము. అర్థమైనా దానిని పాటించడమెలాగో చేతకాదు. ఒకవేళ చేతనైనా మన ఇష్టాయిష్టాలు అడుగడుగునా అడ్డు తగులుతుండడం వల్ల ఏవేవో సాకులు అడ్డమేసుకుంటుంటాము.

అలాగాక, మనకు స్పష్టంగా వచ్చిన ఆదేశాలుగాని, స్వప్న దర్శనాల ద్వారా వచ్చిన ఆదేశాలుగానీ తప్పక పాటించాలి. అంతేగాక పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సూక్తులను గాని, శ్రీసాయిబాబా చెప్పిన సూక్తులను గానీ అమలుపరచడానికి యత్నిస్తుంటే మన మాట, ప్రవర్తన మారడం ప్రారంభిస్తుంది. అప్పుడు మన సంస్కారాలలో క్రమంగా మార్పు వస్తుంది. అప్పుడు మనం వారి అనుగ్రహానికి పాత్రులమవుతాము.

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఆదేశాలను పాటించడానికి ప్రయత్నం ప్రారంభిద్దాము. ఈ గురుపూర్ణిమ సందర్భంగా మనమిచ్చే ఈ దక్షిణకు మించినది మరేమున్నది? •

పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సూక్తులను గాని, శ్రీసాయిబాబా చెప్పిన సూక్తులను గానీ అమలుపరచడానికి యత్నిస్తుంటే మన మాట, ప్రవర్తన మారడం ప్రారంభిస్తుంది. అప్పుడు మన సంస్కారాలలో క్రమంగా మార్పు వస్తుంది. అప్పుడు మనం వారి అనుగ్రహానికి పాత్రులమవుతాము.

శ్రీ సాయిమాస్టర్ ! జై సాయిమాస్టర్ !!

~వేదమ్మ~

"నా సమాధి మాట్లాడుతుంది. నా మట్టి సమాధానమిస్తుంది!" అని సమర్థసద్గురువైన శ్రీ సాయినాథులు అభయమిచ్చారు. అలా ఆయన పరిసమాప్తిలేని పరిపూర్ణ దత్తావతారంగా మన మధ్య నిత్యసత్యులై నిలిచారు. అంటే మన నిత్యజీవితాలలో ఇప్పుడున్నటువంటి, ఇకముందు రాబోయేటటువంటి సమస్యలన్నింటికీ పరిష్కారమార్గం ఆ సమర్థ సద్గురువు లీలలలోను, బోధలలోను, ఆచరణలోను వున్నదన్నమాట. అయితే ఆ పరిష్కారమార్గాన్ని మనం తెలుసుకోగలగాలంటే ఆ సమర్థసద్గురువు లీలలను, బోధలను, ఆచరణను మన నిత్యజీవితాలలోని ప్రతి అంశానికీ అన్వయించుకుని ఆచరించడం నేర్చుకోవాలి. మనకు అలా అన్వయించుకుని ఆచరించేందుకు కూడా ఆచరణే బోధగా కలిగిన మార్గదర్శకత్వం కావాలి. కనుకనే ఆ దత్తాత్రేయస్వామి ఒక వంక సమర్థ సద్గురువైన సాయినాథునిగా, మరొకవంక వారి ఉత్తమశిష్యులైన పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు, పూజ్యశ్రీ ఎక్కిరాల అలివేలు మంగతాయారుగారు రూపాలలో అవతరించి మనకు మార్గదర్శకులయ్యారు.

సద్గురువు తమను అనన్యంగా చింతన చేసే భక్తులను తమంతవారుగా చేస్తారని శాస్త్రం. సాయి కూడా, "ఎవరైతే నన్నే చూస్తూ, నా గురించే చింతన చేస్తారో వారు నాలాగా మారిపోతారు!" అని చెప్పారు. సాయి కూడా తమ గురువుకు అలా అనన్యంగా సేవ చేసి వారి అనుగ్రహానికి పాత్రులవడం ఆయన చరిత్రలో చూస్తాము. ఆ వాక్యం అక్షరసత్యమనడానికి

పూజ్యశ్రీ మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగారి జీవితాలే నిదర్శనం. శ్రీ సాయినే తమ శ్వాసగా నిలిపి, ఆయనను అనన్యంగా చింతన చేస్తూ, ఆయననే సేవిస్తూ, ఆయన గురించే మాట్లాడుతూ వారిరువురూ సాయియొక్క మరో రూపమై నిలిచారు. శ్రీ సాయిని వారి గురువు శిష్యునిగా స్వీకరించినట్లే, శ్రీ సాయియే పూజ్యశ్రీ మాస్టరుగారిని శిష్యునిగా స్వీకరించారు. పూజ్యశ్రీ అమ్మగారు తమ అనన్య చింతన చేత, అనన్యమైన సేవ చేత తమ గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారిని మెప్పించి ఆయన చేతనే 'ఈమే నా నిజమైన శిష్యురాలు!" అని చెప్పించుకోగలిగారు. అలా పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెను తమంతటివారిగా చేసి మన మధ్య తమ ప్రతిరూపంగా నిలిపారు. బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి, తమకూ భేదమేలేదని పూజ్యశ్రీ అమ్మగారు భక్తులకెన్నో అనుభవాలిచ్చారు.

పూజ్యశ్రీ అమ్మగారు తమ అనన్య చింతన చేత, అనన్యమైన సేవ చేత తమ గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారిని మెప్పించి ఆయన చేతనే "ఈమే నా నిజమైన శిష్యురాలు!" అని చెప్పించుకోగలిగారు. అలా పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెను తమంతటివారిగా చేసి మన మధ్య తమ ప్రతిరూపంగా నిలిపారు.

సమర్థసద్గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారు భర్తగా వారి జీవితంలోకి రాకముందే సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథులు అమ్మగారిని అనుగ్రహించారు, ఆశీస్సులందించారు. చాలా చిన్న వయస్సులోనే ఒకసారి అమ్మగారు తమ ఇంటికి దగ్గరలో జరుగుతున్న శ్రీ సాయిబాబా సత్సంగానికి వెళ్ళారు. అక్కడవున్న శ్రీ సాయినాథుని చిత్రపటం చూడగానే ఆమెకు ఆనందపారవశ్యం కలిగి శరీరం అదుపుతప్పింది. ఆ చిత్రమైన అనుభవం అర్థంకాక ఆ చిన్నారి అమ్మగారు వెంటనే ఇంటికి వచ్చేశారు. ఆ ప్రభావం కొంతకాలం వున్నదని, ఆ అనుభవం వలన అప్పట్లో బాబా అంటే కొంచెం భయంగా వుండేదనీ అమ్మ నాతో చెప్పారు.

కాలాంతరంలో ఆమె జిల్లేళ్లమూడి అమ్మకు భక్తురాలై యుక్తవయస్సులోనే ఆ మహాత్మురాలి సేవకు అంకితమై, అనన్యంగా చాలా సంవత్సరాలు సేవించారు. ఆ తరువాత కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో అక్కడనుంచి ఆశ్రమంవారు పూజ్యశ్రీ అమ్మగారిని ఇంటికి పంపివేశారు. తన జీవితమంతా జిల్లేళ్లమూడి అమ్మ సన్నిధిలోనే గడిపేయాలని నిర్ణయించుకున్న పూజ్యశ్రీ అమ్మగారు ఆ వియోగాన్ని భరించలేక చాలా బాధపడ్డారు. ఇక జీవితమే వ్యర్థమనిపించిందట ఆమెకు!

ఆ సందర్భంలో అమ్మగారికి సమర్థసద్గురువైన శ్రీ సాయినాథులు స్వప్నదర్శనమిచ్చి, "నువ్వు నా దానివి. అందుకే నిన్ను అనేక మిషలమీద అక్కడినుంచి తప్పించి ఇక్కడికి రప్పించాను!" అని స్పష్టంగా చెప్పారు. ఆ స్వప్నం వచ్చిన క్షణంనుంచి వారిని అప్పటివరకూ కుదిపేస్తున్న బాధంతా తుడిచిపెట్టుకుపోయింది. మనస్సు శాంతి, ఆనందము, ఉత్సాహములతో నిండిపోయింది. బాబా మీద భక్తి, కృతజ్ఞతలతో పూజ్యశ్రీ అమ్మగారి హృదయం పులకించిపోయింది.

ఆ క్షణంనుంచి బాబా స్మరణ, సేవే ఆమె ఊపిరి. వారి ఇంటిలో వున్న చిన్న పూజగదిలో నిరంతరం బాబా ధ్యానం, జపము, పారాయణ, సేవలలో మునిగిపోయారామె. రోజంతా తీవ్రమైన సాధనలో గడిపేవారు. సహజంగా మితభాషి అయిన పూజ్యశ్రీ అమ్మగారు అత్యవసరమైతే తప్ప మాట్లాడేవారే కాదు! స్మరణతో మనసు నింపుకుని మౌనంగా ఇంటి పనులలో తమ తల్లికి సహాయపడడం, ఆ తరువాత మిగిలిన సమయమంతా తీవ్రమైన సాధన — ఇదే ఆమె జీవితం. వారి సోదరుని ఇంటికి దగ్గరలోనే మరో గది అద్దెకు తీసుకుని, కుటుంబానికి భారం కాకుండా పిల్లలకు పాఠాలు చెబుతూ తమ కాళ్ళమీద తాము ఆర్థికంగా నిలబడి, అవివాహితగా జీవితాంతం వుండిపోయి, తీవ్రసాధనలో జీవితం గడిపేయాలని నిర్ణయించుకున్నారు పూజ్యశ్రీ అమ్మగారు.

కానీ బాబా నిర్ణయం మరోలా వుంది! తమ ఉత్తమ భక్తురాలికి తమ ప్రతిరూపమైనటువంటి సమర్థ సద్గురువులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని భర్తగా అనుగ్రహించి, ఆమెను ఆయనకు ఉత్తమ శిష్యురాలిగా చేసి ఇటు

గురుశిష్యసాంప్రదాయాన్ని, అటు పాతివ్రత్యధర్మాన్ని పునఃప్రతిష్ఠింపచేయటమే ఆ ప్రణాళిక. తద్వారా ఇద్దరి అవతారకార్యం మమేకమై ఉత్తమ గృహస్థధర్మాన్ని నిలబెట్టడం కూడా ఆ ప్రణాళికలో భాగమే! ధర్మాన్ని పునరుద్ధరించడమంటే ఇదే కాబోలు! అదే వీరందరి అవతారకార్యం.

మహాత్ములందరూ సాయి ప్రతిరూపాలే గనుక ఆ ప్రణాళిక ముందే మహాత్ములందరికీ తెలుసన్నమాట! కనుక పూజ్యశ్రీ మాస్టరుగారికి చీరాలస్వామి చీర ప్రసాదించడం, పాకలపాటి గురువుగారు పూజ్యశ్రీ అమ్మగారిని (ప్రత్యక్షంగా పరిచయంలేకున్నా) పూజ్యశ్రీ మాస్టరుగారికి అర్ధాంగిగా సూచించడం ఆ లీలలోని భాగమే! అంటే పూజ్యశ్రీ అమ్మగారు వీరందరికీ ముందే తెలిసివుండాలి. బాబా పూజ్యశ్రీ మాస్టరుగారిని ఈ వివాహం చేసుకోమని ఆదేశించడం చరిత్రలో చదివాము. అలాగే బాబా పూజ్యశ్రీ అమ్మగారికి స్వప్నదర్శనమిచ్చి, "తాయీ! ఈ వివాహం నేను జరిపిస్తున్నాను" అని అభయమిచ్చారు. అలా ఆ సద్గురువు ఆజ్ఞను భక్తితో స్వీకరించి పూజ్యశ్రీ అమ్మగారు వివాహానికి అంగీకరించారు.

సమాధి అనంతరం కూడా పూజ్యశ్రీ అమ్మగారు ఎందరికో ప్రత్యక్ష దర్శనమనుగ్రహించి మార్గదర్శకత్వం చేశారు. ఎన్నో ఏళ్లుగా తగ్గని వ్యాధులు పూజ్యశ్రీ అమ్మగారి సమాధి వద్దకు వచ్చి ప్రార్థించుకుంటే తొలగిపోయాయి. ఎందరో భక్తుల కోరికలు, కష్టాలు తీరిపోతున్నాయి.

ఆ తరువాత పూజ్యశ్రీ అమ్మగారికి సాయి శిరిడీలో దర్శనమిచ్చి, "నువ్వు మెదలక కూర్చో! అన్నీ నేను జరిపిస్తాను!!' అని చెప్పారు. ఆ సద్గురువుని ఆజ్ఞను శిరసావహించి పూజ్యశ్రీ అమ్మగారు తమ జీవితాంతం ఆ స్పృహలోనే నిలిచిపోయారు. కాలాంతరంలో వారి శరీరానికి తీవ్రమైన వ్యాధి వచ్చి జీవితాంతం మంచానికే పరిమితమవ్వవలసి వచ్చింది. అయినా అమ్మగారు తొణకలేదు. ఆ వ్యాధిని తగ్గించమని బాబాను ప్రార్థించలేదు. అంతేకాదు, మేము చిన్నపిల్లలముగా వున్నప్పుడే పూజ్యశ్రీ మాస్టరుగారు శరీరం చాలించారు. అయినా అమ్మగారు చలించలేదు. నాకు బాబా ఇలా ఎందుకు చేశారని కృంగిపోలేదు. లౌకికంగా ఎన్ని కష్టాలు వచ్చినా ఆమె దృఢంగా నిలిచారు. బాబా అన్నింటినీ జరిపిస్తున్నారని ఆమెకు స్పష్టంగా తెలుసు. బాబా అభయంతో అత్యంత ధీమాగా, ధైర్యంగా జీవితాన్ని గడిపారు ఆమె! అందుకే క్షణక్షణము ఆ సద్గురుని అంతులేని కృపకు పులకరిస్తూ జీవితమనే లీలానుభూతిలో ఆమె నిలిచిపోయారు! జీవితంలోని ప్రతి సంఘటనా... అది కష్టమైనా, సుఖమైనా సమర్థ సద్గురులైన

సాయిలీలగా కనిపించేది ఆమెకు! అచంచలమైన విశ్వాసము వలన అమ్మగారికి జీవితంలోని ఏ కష్టమూ కష్టం కాకుండా పోయింది. వారి జీవితంలోని ప్రతిక్షణం బాబా పట్ల కృతజ్ఞతతో పులకించిపోయింది.

పూజ్యశ్రీ అమ్మగారు వివాహానంతరం తమకు సాయి అనుగ్రహించిన భర్త రూపంలో ఉన్నటువంటి సమర్థ సద్గురుమూర్తి అయిన పూజ్యశ్రీ భరద్వాజులకు సర్వస్వ శరణాగతి చెందారు. పూజ్యశ్రీ మాస్టరుగారు విధించిన తీవ్ర సాధనలను అకుంఠిత దీక్షతో నిర్వర్తించారామె. తమ శరణాగతితో, దీక్షతో ఆ సద్గురువును మెప్పించి ఆయనకు ఉత్తమ శిష్యురాలై సేవించి తరించారు. తమ సద్గురుమూర్తి అయిన పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధిస్థితులై శాశ్వతులైన తరువాత ఆయన ప్రతిరూపమై నిలిచి ఆయన అవతార కార్యాన్ని కొనసాగించారు. ఆయనను నిరంతరం అత్యంత శ్రద్ధాభక్తులతో సేవిస్తూ, ఆయన బోధను తమ ఆచరణతోను, బోధలతోను, రచనలతోను, దీక్షలతోనూ దశదిశలా వ్యాపింపచేసి ఆయన అవతార కార్యానికి సారధి అయ్యారు. బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికీ, తమకూ భేదమే లేదని తాము సశరీరంగా వుండగానే ఎందరో భక్తులకు ఎన్నో అనుభవాలిచ్చారు.

గత సంవత్సరం పూజ్యశ్రీ అమ్మగారు శరీరం త్యజించి విశ్వరూపులయ్యారు. పూజ్యశ్రీ అమ్మగారు శరీరం చాలించిన ఈ సంవత్సర కాలంలో వారు నిత్యసత్యులని నిరూపిస్తూ ఎన్నో లీలలు వారి సన్నిధిలో జరిగాయి. ఇంకా జరుగుతూనే వున్నాయి. సమాధి అనంతరం కూడా పూజ్యశ్రీ అమ్మగారు ఎందరికో ప్రత్యక్ష దర్శనమనుగ్రహించి మార్గదర్శకత్వం చేశారు. ఎన్నో ఏళ్లుగా తగ్గని వ్యాధులు పూజ్యశ్రీ అమ్మగారి సమాధి వద్దకు వచ్చి ప్రార్థించుకుంటే తొలగిపోయాయి. ఎందరో భక్తుల కోరికలు, కష్టాలు తీరిపోతున్నాయి. బాబా అభయమిచ్చినట్లే ఆయన ప్రతిరూపమైన పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి, పూజ్యశ్రీ అమ్మగారి సమాధి కూడా భక్తులతో మాట్లాడుతున్నాయి.. వారి మట్టికూడా సమాధానం చెబుతోంది! ఈ లీలావైభవంలో, ఈ అవతారకార్యంలో మరో మహత్తరమైన శకం ఆరంభమైంది. అందులో సేవకులమై వారిని సేవిస్తామో, సాక్షులమై మిగిలిపోతామో మనమే ఆలోచించుకోవాలి!

జై సాయి మాస్టర్!

“భగవంతునికి చెడు అంటేను, చెడుకు భగవంతుడంటేనూ భయం”

~పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ~

('ఆచార్య భరద్వాజ కృతజ్ఞతా మహోత్సవము' సందర్భంగా పూజ్య గురుపత్ని మే 2012 సంచికలో వ్రాసిన వ్యాసము పునర్ముద్రితము)

“భగవంతునికి చెడు అంటేను, చెడుకు భగవంతుడంటేనూ భయం” అని బాబా సూక్తి. దీనిని గురించి కొద్దిగా వివరించుకుందాము.

ఇందులో మూడు అంశాలు ముఖ్యంగా యిమిడి వున్నాయి.

1) అసలు భగవంతుడంటే ఎవరు?

2) మంచి-చెడు అంటే ఏమిటి?

3) చెడు అంటే భగవంతునికి భయమేమిటి?

భగవంతుడంటే సకల సృష్టికీ మూలమైనవాడు, సకలాన్ని సృష్టించినవాడు. ద్వంద్వాతీతుడు, కానీ ద్వంద్వాలను సృష్టించాడు. అంటే భగవంతుడు ద్వంద్వాతీతుడైనప్పటికీ ద్వంద్వాలను సృష్టించాడు. పగలు-రాత్రి, వెలుగు-చీకటి, చలములు-అచలములు ఇలా అన్నీ ద్వంద్వాలే. అన్నీ వైవిధ్య భరితమైనవే. అలా ఆయనే సృష్టించాడు. మరి వీటిలో మంచి-చెడు ఏమిటి? ఆయన సృష్టిలో కొన్ని మంచివి, కొన్ని మంచివి కానివీ వున్నాయా? ఆయన సృష్టిలో వుంటే వుండవచ్చుగాక, ఆయన దృష్టిలో గూడ వున్నాయా? ఉంటే అవి ఏమిటి? అసలు 'చెడు' అంటే ఏమిటి? 'మంచి' అంటే ఏమిటి?

సృష్టిలో అన్నీ వైవిధ్యభరితమైనవే అయినప్పటికీ దేనికీ ఏదీ అడ్డురాదు. సృష్టిలో ప్రతి ప్రాణి గూడ భేదాలతో కూడి వుంటుంది. అయినా వేటికవి వాటి వాటి స్వభావాలను బట్టి ప్రవర్తిస్తుంటాయి. అందుకని వీటికి వేటిమీదా ప్రత్యేక ప్రభావముండదు. సృష్టి వాటికి విధించిన ధర్మాన్ననుసరించి అవి జన్మించడము, వృద్ధి చెందడము, నశించడము జరుగుతూ వుంటుంది.

అయితే మానవుడు గూడ అలాగే జన్మించినప్పటికీ అలోచించగల మనస్సుగల అతడు వూరికే వుండలేడు. కనుక సృష్టిలోని ప్రతిదానిని గూర్చి తన శక్తి మేరకు ఆలోచిస్తాడు. తన పరిధిలో తెలుసుకుంటాడు. అయితే అంతటితో ఆగక కొన్నింటిమీద ఇష్టము, కొన్నింటి మీద అయిష్టము ఏర్పరచుకుంటాడు. అంతటితో ఆగక తనకు ఇష్టమైన దానిని కావాలనుకోవడము, ఇష్టంలేని దానిని వద్దనుకోవడమూ చేస్తాడు. దానితో కావాలనుకున్న దాని కోసం తపన, ఆందోళన పడతాడు. కావాలనుకున్నది లభిస్తే సంతోషము, లభించకపోతే దుఃఖము. ఒకవేళ కావాలనుకున్నది లభించినా ఆ సంతోషం ఎక్కువ కాలముండదు. మరొకటి కావాలనిపిస్తుంది. కనుక మళ్ళీ మొదటికే వస్తుంది. అతడు కావాలనుకున్న దానిని పొందే ప్రయత్నంలో పడే ఆరాటము, ఆందోళన అతనికి మనశ్శాంతి లేకుండా చేస్తాయి. అంతేగాక తాను కోరుకున్నది మరొకరికి లభిస్తే వారిపట్ల కోపము, అసూయ,

భగవంతుడు పరమానంద స్వరూపుడు. నిత్యతృప్తుడు. ఇతర ప్రాణులకు వలెనే మానవుని గూడ భగవంతుడు తానెలా సృష్టించాడో అలా వుండాలనే సృష్టించాడు. మానవుడు దానికి భిన్నంగా ప్రవర్తించడమే చెడు.

ద్వేషము కలుగుతాయి. దానివలన తనకు, ఇతరులకూ అశాంతి కలుగుతుంది. దీనినే 'చెడు' అంటారు.

భగవంతుడు పరమానంద స్వరూపుడు. నిత్యతృప్తుడు. ఇతర ప్రాణులకు వలెనే మానవుని గూడ భగవంతుడు తానెలా సృష్టించాడో అలా వుండాలనే సృష్టించాడు. మానవుడు దానికి భిన్నంగా ప్రవర్తించడమే చెడు. తనకు ప్రాప్తించిన దానిని తృప్తిగా అనుభవించక లేనిదేనికోసమో వెంపరలాడడమే చెడు. సృష్టిలో ఏ ఇతర ప్రాణీ అలా వెంపరలాడదు. తనకున్న పరిధిలో తాను ఎదగడానికి ప్రయత్నిస్తుంది. కానీ మానవుడు తాను పుట్టినప్పటి నుండీ ఎదిగే ప్రయత్నంలో అనేక విధాలైన మానసిక భావాలను పొందుతాడు. అట్టి భావాలననుసరించి అనేక కర్మలు చేస్తాడు. వాటిలో మంచి కర్మలు, చెడు కర్మలు వుంటాయి. మంచి కర్మలు చేయడం వల్ల తనకు, ఇతరులకూ శ్రేయస్సు, శాంతి చేకూరుతాయి. చెడు కర్మలు చేసినపుడు తనకు, ఇతరులకూ నష్టము, అశాంతి కలుగుతాయి. ఉదాహరణకు ఒకడు మరొకరికి ఉపకారము చేసాడని అనుకుందాము. అందువలన ఆ చేసినవాడికీ, పొందినవాడికీ సుఖశాంతులు కలుగుతాయి. అలాగాక అపకారము చేస్తే ఇరువురికీ దుఃఖము, అశాంతి తప్పవు. అదే భగవంతుని దృష్టిలో 'చెడు'.

అంటే తనకు శ్రేయస్సును, ఇతర జీవులకు శ్రేయస్సును కలుగజేసుకుని సుఖశాంతులలో జీవించమని మానవునకు మేధస్సును ప్రసాదిస్తే, తాను సృష్టించిన మానవుడు తనకు, ఇతరులకూ అశాంతిని కల్పించుకోవడమే భగవంతుని దృష్టిలో 'చెడు'. ఆ విధంగా చెడు చేస్తున్నవాడికి మంచి చేయడం సాధ్యం కాదు.

భగవంతుని సృష్టిలో స్వచ్ఛమైన నీరూ వుంటుంది, బురదగూడ వుంటుంది. నిప్పు, నీరూ వుంటుంది. విషతుల్యమైన చెట్లు వుంటాయి. అమృతతుల్యమైన వృక్షములూ వుంటాయి. అలా ప్రతిదీ పనికి వచ్చేదిగాను, పనికి రానిదిగానూ గూడ వుంటుంది. అసలు సృష్టిలో పనికిరానిదంటూ ఏదీ లేదు. ఒకటి ఒక దానికి పనికిరాకపోవచ్చు. మరొకదానికి పనికి రావచ్చు. ఇలా అన్నీ వైవిధ్యమైనవే అయినా అన్నీ పనికి వచ్చేవే.

విచిత్రమేమంటే ఏ జీవీ తనకు పనికిరాని(అవసరం లేని) వాటి జోలికి పోదు, ఉపయోగించుకోదు గూడా.. కానీ మానవుడు తనకు అవసరమైనవే గాకుండా అనవసరమైన వాటికోసం గూడ పరుగెత్తుతాడు. బురదే బాగుందని తలచి అందులో దిగుతాడు. ఎండమావులను

నీరని భ్రమించి వాటి వెంట పరుగెత్తుతాడు.

అంతేగాక స్వార్థంతో ప్రతిదానినీ సరియైన పద్ధతిలో



ఉపయోగించుకోక ఇతర జీవులకు, సాటి మానవులకూ కష్టము, నష్టము కలుగజేస్తాడు. అంతటితో ఆగక ప్రకృతిని సైతం స్వార్థంతో కలుషితం చేస్తాడు. ఛిన్నాభిన్నం చేస్తాడు. పర్యవసానంగా తన వినాశనానికి, తక్కిన ప్రపంచ వినాశనానికి కారణభూతుడవుతాడు. అదే భగవంతుని దృష్టిలో 'చెడు' అంటే.

ఇవిగాక మనలోని కుసంస్కారాలు, చెడ్డ ఆలోచనలు గూడ 'చెడు' అని చెప్పవచ్చు. అందువలన మనం చేసే చెడ్డ కర్మలుగూడ 'చెడు' అని చెప్పవచ్చు. ఇతరులకు చెడు బోధించడము, వారిని చెడు ప్రవర్తనకు అలవాటు చేయడము, చెడు వ్యసనాలకు బానిసలుగా చేయడము గూడ చెడు లక్షణాలే.

ఇక మూడవది - 'భగవంతునికి చెడు అంటే భయమేమిటి?' అన్నది. అసలు భగవంతుడు భయపడతాడా? అన్నది ప్రశ్న. అసలు ఇక్కడ భయపడడము అంటే అర్థమది కాదు. వెలుగుకు చీకటి అంటేను, చీకటికి వెలుగు అంటేనూ భయం అన్నట్లు. వెలుగు చీకటిని చూసి భయపడడమంటూ వుండదు. అయితే చీకటి వున్నచోట వెలుగు వుండదు. అలాగే "చెడు వున్నచోట భగవంతుడు వుండడు, భగవంతుడు వున్నచోట చెడు వుండడానికి అవకాశం లేదు" అని అర్థం.

భగవంతుడు సద్గుణ సంపన్నుడు. సుగుణాలే ఆయన స్వరూపం. మరి ఆయన దగ్గర దుర్గుణాలు ఎలా వుండగలుగుతాయి? కనుక దుర్గుణాలు వున్న చోట సుగుణాలుగల ఆయన వుండడం సాధ్యపడదు.

అంటే మానవునిలోని దుర్గుణాలు, వాటివల్ల వచ్చే దురాలోచనలు, వాటివల్ల చేసే దుష్కర్మలు, వాటివల్ల కలిగే దుష్ఫలితాలే భగవంతుని దృష్టిలో 'చెడు'. అవి మనలో వుంటే మన చెంత ఆయన వుండడు. కనుక మనలో పైన చెప్పుకున్న దుర్గుణాలు వుంటే వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. అట్టి ప్రయత్నం నిరంతరం చేస్తూ భగవంతుని చెంత మనము, మన చెంత భగవంతుడు వుండేలా ప్రవర్తిద్దాము .

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా మనలోని దుర్గుణాలను పారద్రోలుకోవడమే గాక, సుగుణాలను అలవరచుకునేలా, సత్కర్మలు చేసేలా అనుగ్రహించమని, శ్రీ సాయిబాబాను, పూజ్యశ్రీ మాస్టరుగారినీ మనసారా ప్రార్థిద్దాము.•

మాతృదేవో భవ!

~శ్రీమతి శ్రీదేవి~

ఈ విశ్వాన్ని సృష్టించింది భగవంతుడే. సృష్టిధర్మాలు తారుమారై నప్పుడు తిరిగి ఆ ధర్మాలను పునఃప్రతిష్టించేందుకు భూమిపై భగవంతుడు మహాత్ముల రూపంలో అవతరిస్తాడని పెద్దలు చెబుతారు. అలా ఎందరో మహనీయులు అవతరించి మానవాళిని తరింపజేశారు. వారి నాశ్రయించిన భక్తులు వారి అనుగ్రహంతో సుఖశాంతులు పొందుతారన్నది, ఆధ్యాత్మికంగా పురోగతి చెందుతారన్నది మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న సత్యం.

తమ నాశ్రయించిన భక్తులకు యిహపరాలను ప్రసాదించి అనుగ్రహించే శ్రీ దత్తాత్రేయ స్వామి యీ కలియుగంలో శ్రీ భరద్వాజ గురుదేవులుగా అవతరించి, ఆధ్యాత్మికంగా నిద్రాణమైయున్న మానవ జాతిని మేల్కొలిపి, పరమార్థం వైపు నడిపించే మార్గదర్శకులై వెలుగొందారు. తన బోధలు, రచనల ద్వారా జనులను ఉత్తేజపరుస్తూ నాటికీ నేటికీ ధర్మ రక్షకులుగా నిలిచివున్నారు. తమ దివ్యానుగ్రహంలో, దివ్యాశీస్సులతో ఆశ్రితుల బాధలు బాపుతూ, కోరికలు తీరుస్తూ వారి హృదయాలలో దైవమై నిలిచారు.

> **తమ నాశ్రయించిన భక్తులకు యిహపరాలను ప్రసాదించి అనుగ్రహించే శ్రీ దత్తాత్రేయ స్వామి యీ కలియుగంలో శ్రీ భరద్వాజ గురుదేవులుగా అవతరించి, ఆధ్యాత్మికంగా నిద్రాణమైయున్న మానవ జాతిని మేల్కొలిపి, పరమార్థం వైపు నడిపించే మార్గదర్శకులై వెలుగొందారు.**

అంతటి మహాత్ముని సహధర్మచారిణిగా స్థానాన్ని పొందిన మహనీయురాలు నా సోదరి అయిన మాతృశ్రీ అలివేలు మంగతాయారు. శ్రీ భరద్వాజ భగవానుని అర్ధాంగి మా అక్కయ్య అలివేలు మంగతాయారుగారి పరమ పుణ్యప్రదమైన జీవన విధానాన్ని గురించిన సత్యాలను నా అవగాహనకు అందినంత మేర నాకు తెలిసినవి మీతో పంచుకోనాలన్నదే నా యీ రచన యొక్క వుద్దేశం.

గుంటూరు జిల్లా బాపట్ల తాలుకా 'మన్నవ' మా స్వగ్రామం. శ్రీ మన్నవ బాలకృష్ణ శర్మగారు, శ్రీమతి రంగనాయకమ్మగారు మా తల్లిదండ్రులు. భగవంతుడు ఆధ్యాత్మికత నేపథ్యంగా గల కుటుంబాలను తాను మహాత్ముని రూపంలో అవతరించటానికి తగిన ప్రదేశంగా ఎన్నుకుంటారని పెద్దలు చెప్పిన మాట సత్యం అనటానికి నిదర్శనం మా పూర్వీకులలో భగవంతుని ప్రత్యక్షంగా గాంచుకొన్న జ్ఞానులు, భక్తులు ఎందరో వుండటమే! మా తల్లిదండ్రులు రామభక్తులు. ఆ కారణం చేతనే శ్రీ అలివేలుమంగమ్మగారు మా కుటుంబంలో జన్మించారనటంలో సందేహం లేదు.

చిన్నప్పటి నుండి అక్కయ్య ధీర గంభీర

హృదయురాలు. ప్రతి విషయాన్నీ నిశితంగా పరిశీలించేవారు. ఇంటి పరిస్థితులను, యితరుల కష్టసుఖాలను అర్థం చేసుకుని తన వంతుగా సహాయపడేవారు.

మా తండ్రిగారి పినతండ్రి శ్రీ మన్నవ సీతాపతిగారి కుమార్తె అనసూయమ్మగారు రాజరాజేశ్వరీ ఉపాసనతో గొప్ప తపస్వినిగా, మహనీయురాలిగా ఖ్యాతిగాంచారు. బాపట్ల సమీపంలోని జిల్లెళ్ళమూడి కరణంగారైన బ్రహ్మాండం నాగేశ్వర్రావుగారితో వివాహం జరిగాక ఆమె జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధి కెక్కారు. మా కుటుంబము, బంధువులు ఆమె దర్శనార్థం జిల్లెళ్ళమూడి వెళ్ళవస్తుండేవాళ్ళం. మాయింట్లో ఎప్పుడూ జిల్లెళ్ళమూడి అమ్మ గురించిన విషయాలను చెప్పుకొనడం, భక్తితో ఆమెను పూజించుకొనటం, భక్తితో ఆమె ప్రసాదంగా యిచ్చిన కుంకుమ పెట్టుకుంటుండటము – యిలా ఎప్పుడూ యింట్లో అమ్మ స్మరణే. ఇక మా అక్కయ్య అలివేలుమంగమ్మగారయితే యింట్లోను, బయట యిరుగు పొరుగు పిల్లలతో ఆటపాటలలో గడుపుతున్నప్పుడు కూడా నిరంతరం అమ్మ నామస్మరణ చేస్తునేవుండేవారు. ఆమెకు పాటలంటే చాలా యిష్టం. మా పెద్దన్నయ్యగారు శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారు అమ్మ భక్తులు. ఆయన జిల్లెళ్ళమూడి అమ్మను స్తుతిస్తూ ఎన్నో భక్తి గీతాలు వ్రాశారు. మా అక్కయ్య ఎప్పుడూ తన్మయత్వంతో ఆ పాటలు పాడుకుంటూ వుండేవారు.

ఒకసారి మా కుటుంబ సభ్యుల మందరము జిల్లెళ్ళమూడి వెళ్ళాము. అక్కడ కొన్ని రోజులుండి అందరము తిరుగు ప్రయాణమైనాము. అయితే మా అక్క మాత్రం “నేను కొన్ని రోజులు అమ్మ దగ్గరే వుండిపోతాను” అని చెప్పి వుండిపోవటం జరిగింది. చాలాసార్లు మా నాన్నగారు. జిల్లెళ్ళమూడి వెళ్ళి ఆమెను యింటికి తీసుకురావాలని ప్రయత్నించినప్పుడల్లా ఆమె దుఃఖిస్తూ, అమ్మను వదలి వుండలేనని చెప్పటంతో నాన్నగారు తనను యిబ్బంది పెట్టటం యిష్టంలేక తిరిగి వచ్చేసేవారు. అలా 7సం॥ల కాలం గడిచిపోయింది.

మహాత్ముల సన్నిధిలో వుండిపోవాలని చాలామంది ఆశిస్తారు. ఎంతో మందికి అలా వుండిపోయే భాగ్యం కూడా ప్రాప్తిస్తుంది. అయితే ఆ సన్నిధిని సద్వినియోగ పరచుకొనేవారు ఎందరు?

అమ్మ సన్నిధిలోవున్న ఏడు సంవత్సరాల కాలంలో మా అక్కయ్య ఒక్క క్షణం కూడా అమ్మ స్మరణ

మరువలేదు. సున్నితమైన తన శరీరంతో గృహనిర్మాణము వంటి కఠినమైన పనులు – చెఱువునుండి బిందెలతో నీళ్ళుమోయటం, భోజనశాలలో వడ్డనలు, విస్తళ్ళు ఎత్తటం, సుప్రభాత, పవళింపు సేవలు, భజనలు – ఒకటేమిటి? తీవ్ర అనారోగ్య పరిస్థితిలో కూడా సేవలు మానలేదు. నియమం తప్పలేదు. ‘జయహో మాతా! శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి’ అన్న నామాన్ని నిరంతరం పాడుకుంటూ ప్రతి నిమిషం అమ్మ సన్నిధిని సద్వినియోగం చేసుకున్న భాగ్యశాలి అలివేలు మంగమ్మ గారు.

అలా 7సం॥ల సుదీర్ఘకాలం అమ్మ సన్నిధి భాగ్యాన్ని పొందారు. చివరకు 1969వ సం॥లో తీవ్ర అనారోగ్యానికి గురైన కారణంగా జిల్లెళ్ళమూడి అమ్మ వైద్యం నిమిత్తం మాయింటికి బనగానపల్లెకు పంపించటం జరిగింది.

జిల్లెళ్ళమూడి నుండి వచ్చిన తర్వాత మా అక్కయ్య ఎప్పుడూ ఏదో పరధ్యానంగా కన్పించేవారు. ఏకాంతంగా ఏదో ఒక మూల కూర్చుని ఆలోచిస్తూ వుండేవారు. ఏ విషయం మీద వుత్సాహం లేదు. ఇంట్లో ఎప్పుడూ సందడి

వాతావరణం. అయినా ఆ సందడి ఆమె ఏకాంతాన్ని, మౌనాన్ని ఆటంక పరిచేవికాదు. ఆమె లోకం ఆమెది.

అయితే ఆ రోజుల్లో ఆ మౌనం వెనుక ఆమె హృదయంతో ఎన్ని అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయో ఎవరికీ తెలియదు. అలా ఎన్నాళ్ళు ఆ బాధలో గడిపిందో కూడా ఎవరికీ తెలీదు.

ఒకసారి సందర్భవశాన ఆమె ఆ విషయమై యిలా చెప్పారు:

"జిల్లెళ్ళమూడి నుండి తిరిగి రావటం అనే విషయాన్ని ఊహించను కూడా లేను. అమ్మ నన్ను "ఇంటికి వెళ్ళి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత తిరిగి రామ్మా!" అన్నపుడు ఎంత బాధ కలిగిందో చెప్పలేను. అమ్మను విడిచి బ్రతికేకంటే మరణమే మేలనిపించింది. ఇంటికి తిరిగి వచ్చాక మనసంతా తీవ్రమైన బాధ, భరించలేని వేదన. రాత్రి, పగలు ఒకటే ఆలోచన 'నాకీ జీవితం ఎందుకు?' అన్నదే! రోజులు గడుస్తున్నాయి, ఎంతో భారంగా. 'ఈ బాధ యింకా ఎన్నాళ్ళు భరించాలి?' ఇదేనా ఆవేదన!

ఒకనాడు యింటి వెనుక వరండాలో ఒంటరిగా కూర్చునివున్నాను, గతం నెమరు వేసుకుంటూ, ఎందుకలా జరిగిందా! అనుకుంటూ. కొంతసేపు గడిచింది. అకస్మాత్తుగా నా ఎదుట సాయిబాబా దర్శనమిచ్చారు. నిర్ఘాంతపోయి చూస్తున్నాను. "అమ్మా! జిల్లెళ్ళమూడి నుండి నిన్ను యిక్కడకు తీసుకువచ్చింది నేనే. అందుకు కారణం వుంది. అది ముందు ముందు నీకు తెలుస్తుంది. బాధపడకు" అన్నారు. అలా చెప్పి బాబా అదృశ్యమైనారు. బాబా మాటలు అతి స్పష్టంగా వినిపించాయి. నేను ఆ దిగ్భ్రాంతి నుండి తేరుకోలేకపోయాను. ఏమిటిది! ఎంత ఆశ్చర్యం! బాబా నాకు దర్శనమివ్వటమా! అమ్మ ఎడబాటుతో కుమిలిపోతూ 'ఎంత నిర్భాగ్యురాలిని' అని విచారిస్తున్న నాకు సాయిబాబా దర్శనభాగ్యంతో 'నేను నిర్భాగ్యురాలిని కాదు, ఎంతో అదృష్టవంతురాలిని' అనుకొన్నాను. బాబా అభయమివ్వటంతో అప్రయత్నంగా నా వేదన తొలగిపోయింది. నా మనసు శాంతించింది. ఇక తిరిగి యథావిధిగా నా తపోసాధన కొనసాగించాను."

ఈ విషయాలన్నీ అక్కయ్య చాలాకాలం వరకు చెప్పలేదు. ముఖ్యంగా సాయిబాబా ప్రత్యక్ష సాక్షాత్కారం పొందిన ఆమెను ఏవిధంగా భావించాలి? ఆమె తపస్సు ఫలించి భగవత్సాక్షాత్కారం ప్రాప్తించిన తర్వాత ఆమె జీవితం అద్భుతమైన మలుపు తిరిగింది. శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్నిగా నిర్ణయించిన సాయినాథుడు

ఆమెను గృహిణిగా సంసిద్ధురాలిని చేయటానికై ఆశ్రమ వాతావరణం నుండి తిరిగి గృహ వాతావరణంలోనికి తీసుకొనిరావటం జరిగిందనిపిస్తుంది. బ్రహ్మచారిణిగా వుండాలన్న ఆమె సంకల్పాన్ని అనుసరించి ఆమె జిల్లెళ్ళమూడిలో చేసిన అఖండ తపస్సుకు మెచ్చి శ్రీ భరద్వాజ గురుదేవుల సహధర్మచారిణిగా నిర్ణయించి, ఆశీర్వదించారు శ్రీ సాయినాథులు.

అక్కయ్యకు సాయినాథుని సాక్షాత్కారం జరిగిన తర్వాత కొన్నేండ్లు గడిచాయి. ఆ కాలంలో కూడా ఆమె నిరంతర ఆధ్యాత్మిక చింతనలోనే గడిపేవారు. జపము, ధ్యానము, పూజ, సద్గ్రంథపఠన, సత్సంగము - యివన్నీ చేస్తుండేవారు. బియ్యపు గింజలు ఒక్కొక్క గింజ నామస్మరణతో ఏరుతూ అవి కొన్ని కిలోలు అయ్యాక వాటిని వండి పులిహోర చేసి యింటిలోని వారము, యిరుగుపొరుగు వారికే కాక ఊరిలోని బిచ్చగాండ్లకు పంచేవారము. ఇలా ఆధ్యాత్మిక కార్యక్రమాలలో యింటిలో అందరము పాల్గొనేవాళ్ళం.

ఇక్కడ శ్రీ భరద్వాజ గురుదేవుల గురించి, వారి సహధర్మచారిణి గురించి సాయినాథుని నిర్ణయం తెలియజేయబడిన అత్యద్భుత ఘట్టం గురించి ప్రస్తావించుకొందాం. శ్రీ భరద్వాజ గురుదేవులు కొంతకాలం జిల్లెళ్ళమూడిలో వున్నారు. వారు అప్పటికే శిరిడీ సాయినాథుని అనుగ్రహంతో దివ్యానుభూతిని పొందిన మహాత్ములు అయివుండి కూడా, తన దివ్యత్వాన్ని

ఏమాత్రం బయట పడనీయక సామాన్య మానవుని వలె వ్యవహరించేవారు. అయినప్పటికి ఆయనలోని దివ్యత్వం దివ్యపుష్ప పరిమళంవలె అందరికీ విదితమౌతూనే వుండేది. జిల్లెళ్ళమూడిలో వున్నప్పుడు ఆయన అందరికీ ఆధ్యాత్మబోధలు చేస్తుండేవారు. శిరిడీ సాయినాథుని గురించి, వారి బోధలు, మహిమలు వివరిస్తుండేవారు. వారి బోధలతో చాలామంది సాయినాథుని భక్తులవటం జరుగుతుండేది. అలాంటి వారిలో మా కుటుంబం కూడా ఒకటి. మేము. జిల్లెళ్ళమూడి అమ్మతో పాటు శ్రీ సాయినాథుని కూడా ఆరాధించటం ఆరంభించాము.

శ్రీ భరద్వాజ మాస్టరు గారి ద్వారా సాయిబాబా గురించి తెలుసుకొనటానికి ముందే శ్రీసాయితో మాకు అనుబంధం వున్నదనటానికి మాకు గల కొన్ని అనుభవాలు చెపుతాను.

మా చిన్నతనంలో మేము గుంటూరులో వుండేవాళ్ళం. గుంటూరులో మా నాన్నగారు జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుగా పని చేసేవారు. అప్పుడు మేము నివసించే కొత్తపేటలో మా యింటి సమీపంలో 'గడియారంవారి వీధి' అని ఒక వీధి వుండేది. ఆ వీధిలో ఒక సాయిబాబా భక్తురాలు ఉండేవారు. ఆవిడ యింట్లో ప్రతి గురువారం ప్రత్యేక పూజలు, భజనలు జరిగేవి. మేము అక్కడికి వెళ్తుండేవాళ్ళం. ఒక గురువారం మా అక్కయ్య అలివేలు మంగతాయారుగారు అక్కడికి వెళ్ళినపుడు అక్కడ వున్న పెద్ద సాయిబాబా ఫోటో ఎదుట నిలబడగానే ఆమె శరీరం బాగా బరువెక్కి తాను బాహ్యస్మృతి కోల్పోతుండటం గమనించి, గబగబా యింటికి తిరిగి వచ్చేయటం జరిగింది. సాయిబాబాతో యిది ఆమెకు ప్రాప్తించిన మొట్టమొదటి అనుభవం. ఈ విధంగా మా యింట్లోని వారికి బాబాతో అనుబంధం ఆ భక్తురాలి ద్వారా కలిగింది. మా యింట్లో సాయినాథుని పూజలు జరుగుతుండేవి. కొంతకాలం గడిచింది. ఆ తర్వాత విన్న శుభవార్త మాకు ఎంత ఆనందాన్ని కలిగించిందో చెప్పలేను. అదే శ్రీ భరద్వాజగారితో అక్కయ్య వివాహం!

విశాఖపట్నం సమీపంలోని భీమసింగి ఆశ్రమంలో నివసించే ఒక మహాయోగీశ్వరుడు శ్రీ పాకలపాటి గురువుగారు. ఆయన శ్రీ భరద్వాజ గురుదేవులను పిలిపించి, వివాహం చేసుకొమ్మని ఆదేశించి అందుకు తగిన కన్యగా శ్రీ అలివేలుమంగమ్మగారిని సూచించటం, ఆమె గురించిన వివరాలను కూడా చెప్పటం జరిగింది. నిజానికి మాకు ఆయనెవరో తెలీదు. మా కుటుంబసభ్యులం ఎవరమూ ఆయనను దర్శించి ఎరుగము. అలాంటప్పుడు మా అక్కయ్యగారి గురించిన వివరాలు ఆయనకెలా

తెలుసు? దీనికి సమాధానం - భూతభవిష్యత్ వర్తమానాలెరిగిన యోగులకు అందరి జీవితాలు తెరిచిన పుస్తకాలే! ఇందులో ఆశ్చర్యమేముంది? ఆ తర్వాత శ్రీ భరద్వాజగారు తమ గురుదేవులు శ్రీ సాయినాథుని నుండి కూడా యిదే విధమైన ఆదేశం పొందిన తర్వాత వారు ముందుగా మా అక్కయ్యను తన అభిప్రాయం కోరారు. ఈ సందర్భంలో ఆమె స్పందన కూడా చాలా విలక్షణంగా, విశిష్టంగా వున్నదనటంలో సందేహం లేదు. 'వారికి చెప్పిన వారు నాకు కూడా తమ ఆదేశం తెలియపరచాలి కదా' అనుకున్నారట!

గుడిలో ప్రదక్షిణలు చేస్తూ వుంటే ఆ ప్రాంగణంలో కూర్చుని వున్న ఒక అవధూత ఆమెను దగ్గరికి రమ్మని చేతులతో సైగచేసి పిలిచి ఆమె వెళ్లగానే "మీ వివాహం నేనే కదా జరిపించేది? నీకెందుకు సంశయం?" అన్నారట!

శ్రీ సాయి ఆమెకు స్వప్న దర్శనమిచ్చారు. మేము గుంటూరులో వుంటున్న రోజులలో గుంట గ్రౌండ్ ఎదురుగా వుండే సుప్రసిద్ధ ఆంజనేయస్వామి గుడికి తరచు వెళ్ళేవాళ్ళం. అక్కయ్య స్వప్నంలో కొందరితో కలసి ఆ దేవాలయానికి వెళ్లారట. గుడిలో ప్రదక్షిణలు చేస్తూ వుంటే ఆ ప్రాంగణంలో కూర్చుని వున్న ఒక అవధూత ఆమెను దగ్గరికి రమ్మని చేతులతో సైగచేసి పిలిచి ఆమె వెళ్లగానే "మీ వివాహం నేనే కదా జరిపించేది? నీకెందుకు సంశయం?" అన్నారట! ఆమె నమస్కరించగానే ఆయన నవ్వుతూ, రెండు చేతులెత్తి ఆశీర్వదిస్తుండగా మెలకువ వచ్చిందట! అంతటితో ఆమె సంశయం తీరింది.

1975వ సంవత్సరం మార్చి 6వ తేదీ కళ్యాణముహూర్తంగా నిర్ణయింపబడింది.

1975 జనవరి 1వ తేదీన మరల శ్రీసాయి ఆమెకు స్వప్న దర్శనమిచ్చారు. అది కూడా బనగానపల్లెలోని ఆంజనేయస్వామి గుడే! ఆ గుడిలో ఒక చోట శిరిడీ సాయిబాబా ఒక కుర్చీలో కూర్చుని వున్నారట! ఆయన గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న అలివేలుమంగమ్మను "తాయీ! ఇటు రామ్మా!" అంటూ చెయ్యెత్తి పిలిచి ఆమెను ఆశీర్వదించారు.

మరొక గొప్ప విషయం.

1975 మార్చి 6వ తేదీ తెల్లవారు ఝామున 4 గంటలకు శ్రీ భరద్వాజగారి అన్నగారైన శ్రీ వేదవ్యాసుగారు వచ్చి శిరిడీ ప్రసాదం తన స్వహస్తాలతో అక్కయ్యకు యిస్తూ "నేను శిరిడి నుండి నేరుగా యిక్కడికే వచ్చానమ్మా!" అన్నారు ఆమెతో! అలా కళ్యాణ దినాన శ్రీ సాయి ఆమెకు ప్రసాదం పంపి ఆశీర్వదించడం ఎంత అద్భుతం!

ఈ విధంగా లోక కళ్యాణార్థం శ్రీ భరద్వాజ గురుదేవులతో జరిగిన అలివేలుమంగామాత కళ్యాణం సాక్షాత్తు భగవంతుడే జరిపించటమనేది ఎంతటి ఆనందదాయకమైన విషయం!

ఈ వివాహం పూర్తిగా సాయినాథుని పర్యవేక్షణలో జరిగిందనటానికి ఎన్నో నిదర్శనాలు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచిపోయాయి.

మా పెద్దన్నయ్యగారు టుబాకో కంపెనీలో పనిచేసేవారు. ఆయనకు గుంటూరునుండి కర్నూలు జిల్లాలోని బనగానపల్లె అనేవూరుకు బదిలీ అవటం వలన మేము బనగానపల్లెలో వుండేవాళ్ళం. బనగానపల్లెలో మేమొక అద్దె యింట్లో వుండేవాళ్ళం. ఆ యిల్లు చాలా పెద్దది. ముందూ, వెనుకా వరండా లుండేవి. మధ్య ఒకదాని తర్వాత ఒకటి నాలుగు విశాలమైన గదులు, ఉత్తరం వైపున వున్న రోడ్డువైపు ప్రతి గదికీ కిటికీలుండేవి. పెండ్లి నాలుగైదు రోజులున్నదనగా ఒక సంఘటన జరిగింది. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఒక గదిలో విశ్రాంతి తీసుకుంటున్న మా పెద్దవదినకు కిటికీలోంచి సాయిబాబా దర్శనమిచ్చి "లేలే. ఇంకా నిద్ర ఏమిటి? సమయం లేదు. చాలా పనులున్నాయ్" అంటూ కేకలేశారట! ఆమె బద్ధకంగా లేవకుండా అలాగే పడుకొని వుంటే మళ్ళీ మళ్ళీ పెద్దగా అరుస్తూ అన్ని గదులలోని కిటికీలనుండీ అవే మాటలన్నారట. ఆమె ఆశ్చర్యంతో లేచి కూర్చుని అందర్నీ పిలిచి, "బాబా వచ్చారు. మీరు చూశారా? అన్ని కిటికీలలోంచి గట్టిగా కేకలేస్తూ నన్ను నిద్రలెమ్మని అరుస్తున్నారు. మీకు విన్పించలేదా?" అన్నది. సరిగ్గా అదే సమయంలో విజయవాడ నుండి శ్రీ అనంతాచార్యులవారు పెండ్లి 1975 మార్చి 6వ తేదీ అని నిర్ణయిస్తూ పంపిన టెలిగ్రాం అందింది. ఆవిధంగా వదినను నిద్రలేపి పెండ్లి పనుల గురించి తొందరపెట్టి 'ఈ పెండ్లి జరిపిస్తున్నది నేనే' అని సూచించారు.

అప్పటికి పెండ్లిరోజు 5 రోజులు మాత్రమే వుంది.

అందుకే వ్యవధి తక్కువగా వుండటం వలన ఆమెను తొందరపెడుతూ, పిలుస్తూ ఆమెకు ప్రత్యక్ష దర్శనమివ్వడం ఒక లీల! అక్కయ్య జిల్లెళ్ళమూడిలో వుండగానే నాన్నగారు స్వర్గస్థులైనారు. అందువలన ఆ పుణ్యప్రదమయిన కన్యాదాన ఘట్టంలో పాలుపంచుకునే భాగ్యాన్ని పొందిన వదినగారికి సాయినాథుడు తమ దర్శన మనుగ్రహించి ఆశీర్వదించడం ఆమె జన్మజన్మల పుణ్యఫలంగా తోస్తుంది.

కన్నుల పండుగగా కళ్యాణం జరిగిపోయింది. సాయినాథుని ఆదేశం మేరకు కొన్నాళ్ళ తర్వాత శ్రీ మాస్టరుగారు అక్కయ్యతో శిరిడీ వెళ్లేందుకు బనగానపల్లె వచ్చారు. అంతకు ముందు రెండు రోజులుగా ఆమెకు జ్వరం. ప్రయాణం చెయ్యలేనేమోనని అనుకొన్నారు. కానీ విచిత్రమేమంటే శిరిడీ ప్రయాణానికి బయలు దేరాలని ముందుగా నిర్ణయించుకున్న తేదీన చిత్రంగా నిద్రలేస్తూనే ఆమెకు జ్వరమే లేకపోగా కనీసం నీరసం కూడా లేకుండా ఎప్పటి కంటే కూడా ఎంతో ఓపికగా వున్నదని చెప్పి ఆమె ఉత్సాహంగా శిరిడి కి బయలుదేరటం జరిగింది.

ఎంతో సంతోషంగా అలివేలుమంగామాత శ్రీ భరద్వాజ స్వామితో కలసి ఆ శిరిడీ యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చారు.

శ్రీ అలివేలు మంగమ్మ, శ్రీ భరద్వాజు గురుదేవుల కళ్యాణ వేడుకలలో ఎన్నో మహిమలు జరిగాయి. ముఖ్యంగా ఆ వివాహం జరిగిన ఆంజనేయస్వామి గుడి ప్రాంగణంలోని ఒక మండపంలో సాయిబాబా అక్కయ్యకు 1975 జనవరి 1వ తేదీన స్వప్న దర్శనమిచ్చారు. ఆమె గుడిలో ప్రదక్షిణలు చేస్తుంటే మండపంలో కూర్చున్న సాయిబాబా ఆమెను చెయ్యెత్తి తాయీ! రామ్మా!' అని పిలిచారు. మహారాష్ట్ర దేశంలో స్త్రీలను "తాయీ" అనే "మాయీ" అనే ఆ భాషలో పిలుస్తారు. అక్కయ్య వెళ్ళి నమస్కరించగానే ఆయన ఆశీర్వదించారు. ఆమె ఆయన తొడపై తలవాల్చి, ఆయన పాదాల వద్దనే నేలపై కూర్చున్నారు. సాయిబాబా ఆమె తలపై చేయిపెట్టి నిమురుతూ ఆశీర్వదిస్తున్నారు. స్వప్నం అంతమయింది.

ఆ తర్వాత పెండ్లిరోజున పెండ్లికి ముందు జరిగే గౌరీపూజ ఘట్టం సరిగా సాయిబాబా స్వప్నంలో మండపంలో ఎక్కడయితే కూర్చుని దర్శనమిచ్చారో అదే ప్రదేశంలోనే జరిగింది.

ఈ పెండ్లిలో నా అనుభవం కూడా చెప్తాను - పెండ్లి జరుగుతున్నది. పురోహితుల మంత్రోచ్చారణలతో, బాజా భజంత్రీలతో ప్రాంగణం మారుమ్రోగుతోంది. నేను వేదికపైననే నిలబడి కళ్యాణాన్ని తిలకిస్తున్నాను. అలివేలు మంగమ్మ, శ్రీ భరద్వాజ గురుదేవులు కళ్యాణశోభతో, దివ్యకాంతులతో వెలిగిపోతున్నారు. ఎంత దివ్యతేజస్సు వారి చుట్టూ వున్నదో! నా కళ్ళను నేనే నమ్మలేదు.

ఇది అతిశయోక్తి కాదు. నా మనస్సు అంతా చెప్పలేని ఆనందం! నేను మైమరచిపోయాను. నిశ్చలంగా వాళ్ళిద్దర్ని చూస్తున్నాను. వారి దివ్య రూపాలు తప్ప నాకింక ఏమీ కన్పించటం లేదు. దాదాపు స్పృహ కోల్పోయానా అన్నట్లు పరిసరాలేవీ స్ఫురణలో లేవు, నిజంగానే నాకు ఒళ్ళు తెలియలేదు. ఒకటే ఆనందం. ఆ వింత అనుభూతి ఒక్కటే నన్ను ఆవరించింది. ఇంతలో నా భుజంపై ఎవరిదో చేయి గట్టిగా తగిలినట్లయింది. ఉలిక్కిపడి చూస్తే "అక్కా!" అంటూ మా చెల్లెలు అనసూయ పిలుస్తోంది. "అక్కా! ఏమిటీ? ఇక్కడే నిలబడ్డావ్? అవతల కాలేజీ లెక్చరర్లు, హైస్కూల్ హెడ్-మిస్ట్రెస్, టీచర్లు వచ్చారు. వాళ్ళకు కాఫీ టిఫిన్లు ఏర్పాట్లు చూడాలి కదా? పద పద" అంటూ చేయిపట్టి నన్ను లాక్కెళ్ళింది. నేను బాహ్యప్రపంచంలోకి వచ్చాను. అయినా చాలాసేపటి దాకా నాకు ఆ వింత అనుభూతి తొలగిపోలేదు. ఆ అనుభూతి తలచుకొంటే యిప్పటికీ ఆశ్చర్యంగా, ఆనందంగా వుంటుంది.

మధ్యాహ్నంభోజనంచేసినతర్వాత ఒక గదిలో విశ్రాంతి తీసుకుంటున్న మా పెద్దవదినకు కిటికీలోంచి సాయిబాబా దర్శనమిచ్చి "లేలే. ఇంకా నిద్ర ఏమిటి? సమయం లేదు. చాలా పనులున్నాయ్" అంటూ కేకలేశారట!

మరొక చిత్రమైన బాబా లీల యిలా వుంది. ఎదురింట్లో వుండే సరోజినిగారు అనే ఆమె మా కుటుంబంతో చాలా సన్నిహితంగా వుంటూ కుటుంబంలో ఒక సభ్యురాలిగా కలిసిపోయింది. పెండ్లి పనులలో కూడా ఎంతో సహాయం చేసింది. మాస్టరుగారిని పెండ్లి కొడుకును చేసే సమయంలో మాస్టరుగారి తల్లిగారైన లక్ష్మిగారు ముందు రోజే రావాలని అనుకున్నా, వుద్యోగంలో సెలవు దొరకక ముహూర్త సమయానికి కూడా ఊరు చేరలేకపోయారు. అందువల్ల ఈ సరోజిని గారే మాస్టరుగారిని పెండ్లికొడుకుని చేశారు. ఆమె మాస్టరుగారిని తమ యింటికి వచ్చి సాయిబాబా పూజ చేయవలసిందిగా వేడుకున్నది. మర్నాడు తొమ్మిది గంటల సమయంలో మాస్టరుగారు సాయిబాబా ఫోటో చేతిలో పట్టుకుని ఎదురింటికి బయలుదేరారు. అక్కయ్య ఆయనను వాకిలి దాకా సాగనంపటానికి ఆయన వెనకే నడుస్తూ వస్తున్నారు, అలా వస్తుంటే, అక్కయ్య పైట కొంగు సాయిబాబా ఫోటోకు వున్న సీలకు తగిలి కొంగు లాగినట్లు అవటం, అక్కయ్య విడిపించుకొనటం అలా నాలుగుసార్లు జరిగింది. మాస్టరుగారు గేటు దాకా వచ్చారు. అక్కయ్య అక్కడే ఆగిపోయి "వెళ్ళి రండి" అన్నది. మాస్టరుగారు "నిన్ను కూడా రమ్మంటున్నారు, రా!" అన్నారు. నిజానికి అక్కయ్య రావాలని అనుకోలేదు. మాస్టరుగారు పిలవటంతో ఆమె కూడా బయలుదేరింది. వాళ్ళ వెంట నేను, మా అన్నయ్యగారి అమ్మాయి కూడా వెళ్ళాము. మేము వెళ్ళేసరికి సరోజిని గారు ఎదురొచ్చి, ఆశ్చర్యంగా "మంగా, వచ్చేశావా? మీ యిద్దరికీ దంపతి తాంబూలం యివ్వాలని నిన్ననే అనుకున్నాను కానీ భరద్వాజ గారిని మాయింటికి రమ్మని పిలిచేటపుడు నిన్ను రమ్మని చెప్పటం మరచిపోయాను. ఇప్పుడే మీ యింటికొచ్చి నిన్ను పిలుద్దామని బయలుదేరాను. ఇంతలో మీరే వచ్చారు" అన్నది సంతోషంగా. వివాహం తర్వాత దంపతులైన శుభసందర్భంలో మొట్టమొదటగా ఆతిథ్యం, తాంబూలం యిద్దరూ కలిసి స్వీకరించటంతో కళ్యాణ ఘట్టం ముగిసినట్లయింది! ఇలా కళ్యాణం నిర్విఘ్నంగా, శుభప్రదంగా సంపూర్ణమయింది.

మాతృదేవి అలివేలుమంగమ్మగారు తన తపోమహిమతో మాస్టరుగారివలెనే ఎందరో ఆపన్నులను కాపాడారు. కోరికలు తీర్చే కల్పవల్లియై నిలిచారు. మోక్షగాములకు ఎన్నో సాధనలు, దీక్షలు, నియమాలు విధించి ఆధ్యాత్మికంగా ముందుకు నడిపించారు.

అయితే యీ విధంగా యీ మహిమాన్వితమైన కళ్యాణం యింత అద్భుతంగా జరిపించిందెవరు? సకలలోక రక్షకుడు, సర్వేశ్వరుడు ఆ సాయినాథుడే కదా?

మన మాతృదేని అలివేలుమంగమ్మ శ్రీ మాస్టరుగారితో వివాహ ప్రస్తావన వచ్చినపుడు ఆమె ఆ విషయంలో భారమంతా బాబాపై వేసి తాను మౌనంగా వున్న సమయంలో "మీ పెండ్లి జరిపిస్తున్నది నేనే" అంటూ నిశ్చయంగా ఆమెకు తెలియపరచారు. ఆ తర్వాత స్వయంగా యింటికి వచ్చి వదినకు దర్శనమిచ్చి ఆమెను పెండ్లి పనులకు తొందరపెట్టారు. ఆ తరువాత దేవాలయంలో అక్కయ్య గౌరీపూజ చేసే ప్రదేశానికి ముందుగానే వచ్చి ఆమెను అక్కడ కూర్చోబెట్టి ఆశీర్వదించారు.

కళ్యాణఘట్టం ముగింపు దశలో వధూవరులు ఇరువురు దంపతులైన సందర్భంగా ఆతిథ్యం, తాంబూలము వారిచే స్వీకరింపజేశారు. ఈ సందర్భంలో కూడా యిరువురినీ తానే స్వయంగా వారి వెంట వుండి నడిపించారు. ఈ విధంగా సాయినాథుడు 'సత్యవాక్య పాలకుడు' అన్న బిరుదుకు ఎంతగా సరితూగుతారో, "ఈ వివాహం జరిపించేది నేనే" అన్న వాగ్దానాన్ని నిలుపుకొన్న విధానం వలన నిరూపితమౌతుంది.

మాతృదేవి అలివేలుమంగమ్మగారి జీవిత విశేషాలు చెప్పాలంటే, ముఖ్యంగా ఆమె శ్రీ భరద్వాజ గురుదేవులు ప్రతిరూపం అనవచ్చు. శ్రీ మాస్టరు గారితో ఆమె వివాహం జరిగిన తర్వాత ఆమె జీవిత విధానం అందరికీ తెరిచిన పుస్తకం. ఆమె గృహస్థ ధర్మాన్ని నూటికి నూరుపాళ్ళు ధర్మబద్ధంగా నిర్వర్తించారు. మాస్టరుగారి అడుగుజాడలలో నడిచారు. వారినాశ్రయించే అసంఖ్యాక భక్తులను కన్నతల్లికంటే మిన్నగా ఆదరించారు. తన ఆచరణతో స్త్రీలకు మార్గదర్శకులయినారు.

అంతే కాదు, మాతృదేవి అలివేలుమంగమ్మగారు తన తపోమహిమతో మాస్టరుగారివలెనే ఎందరో ఆపన్నులను కాపాడారు. కోరికలు తీర్చే కల్పవల్లియై నిలిచారు. మోక్షగాములకు ఎన్నో సాధనలు, దీక్షలు, నియమాలు విధించి ఆధ్యాత్మికంగా ముందుకు నడిపించారు. భక్తులనేవిధంగా అనుగ్రహించారోనన్న విషయాలను, నాకు తెలిసినంతవరకు ఆమె ధర్మబద్ధమైన జీవితం గురించి మరొకసారి వ్రాస్తాను. ఇప్పటికి యింతటితో ముగిస్తాను.

జై సాయిమాస్టర్!

జై దివ్యజనని అలివేలు మంగమ్మ !!

మాతృదేవి స్మృతులు

~శ్రీ ఆలపాటి శ్రీకాంత్~

జై సాయిమాస్టర్!.. జై దివ్యజనని!..

శ్రీ శిరిడీ సాయిబాబా గురించి దాదాసాహెబ్ కాపర్డే ఇలా చెప్పారు "ఈ రోజు ఆరతి సమయంలో శ్రీ సాయి ఎంతో ప్రసన్నంగా చిరునవ్వు లొలికించారు. ఆ నవ్వులు చూడటానికి ఇక్కడ (శిరిడీలో) కొన్ని సంవత్సరాలు అయినా ఉండవచ్చు. నేను ఆనంద పారవశ్యంలో పిచ్చివాడి లాగా చూస్తూ ఉండిపోయాను." పై వాక్యాలు పూజ్యశ్రీ అమ్మగారికి సరిగ్గా సరిపోతాయి. వారి చూపు, మాటలు, చిరునవ్వు మనల్ని - మన హృదయాలను పరవశింపజేస్తాయి. అద్భుతమైన వారి రూపం ప్రకృతిమాత వలె భక్తుల హృదయాలను పులకింప చేస్తుంది.

నాకు పూజ్యశ్రీ అమ్మగారికి సన్నిధిలో అతి సమీపంలో రెండు, మూడుసార్లు కూర్చునే అవకాశం కలిగింది. ఆ సమయంలో నా ప్రమేయం లేకుండానే నా మనసు ఎంతో శాంతిని, హాయిని అనుభవించింది. శరీరం కూడా చాలా తేలిక అయ్యి సుఖం అనుభవం అయింది. ఇలాంటి అనుభూతి నాకు ఇంతకుముందు శ్రీ షిరిడి సాయి సమాధి మందిరం లోనూ, పూజ్యశ్రీ మాస్టరు గారి సమాధి మందిరంలో తప్ప ఎక్కడ అ అనుభవం అవ్వలేదు. దీన్ని బట్టి అమ్మగారి యొక్క స్థితి అర్థం చేసుకోవచ్చు.

మాది గుంటూరు జిల్లా రేపల్లె దగ్గర 'నగరం' అనే ఊరు. నేను ఇంటర్ చదివే రోజుల్లో ఇంచుమించుగా 1994 ప్రాంతంలో మావూర్లో ఒకతను శ్రీసాయిసన్నిధి, శ్రీ సాయి లీలామృతం గ్రంథాలు ఇచ్చాడు. అవి చదవడం మొదలుపెట్టాక కొంచెం కొంచెం పూజ్యశ్రీ మాస్టరుగారి మీద భక్తిగౌరవాలు పెరిగాయి. 1996 సం॥ నుంచి మావూరి ఆంజనేయస్వామి గుళ్లో సత్సంగం మొదలు పెట్టాము. తరువాత నేను పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి ఒంగోలు వెళ్లాను. 1996-99 మధ్యకాలంలో రెండు, మూడుసార్లు పూజ్యశ్రీ అమ్మగారిని ఒంగోలు వెళ్లి దర్శించుకున్నాను. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారితో సత్సంగంలో ఏవో ఇబ్బందులు వస్తున్నాయని చెబితే పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటో కూడా పెట్టుకోమన్నారు. అంతవరకూ మేము బాబా ఫోటోని మాత్రమే పెట్టుకునే వాళ్ళం. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటో పెట్టుకోగానే ఇబ్బందులు తొలగిపోయాయి.

2000 నేను M.Sc లో చేరటానికి హైదరాబాదుకి వచ్చాను. అప్పుడు కూకట్-పల్లిలో వుండేవాడిని. 2003 నుంచి అక్కడకు దగ్గరలో వివేకానందనగర్ వుంటున్న శ్రీ నాంపల్లి బాబాగారిని దర్శించుకునేవాడిని. కానీ కొంత అసంతృప్తిగా వుండేది, ఎందుకంటే వారు ఏమీ మాట్లాడరు. మనం ఏదన్నా చెప్పుకోవాలన్నా, అడగాలన్నా కుదరదు. అందువల్ల ఒకరోజు, నాతో మాట్లాడే నా భావాలు అర్థం చేసుకునే గురువు దొరికేలా చెయ్యమని నాంపల్లి బాబావారికి మనసులో చెప్పుకుని శ్రీ సాయి లీలామృతం పారాయణ మొదలుపెట్టాను. వారి సమక్షంలో రోజూ కొంత చదువుకునేవాడిని. పారాయణ పూర్తయ్యేలోపు నా కోరిక నెరవేరాలనుకున్నాను. ఒకరోజు శ్రీమతి రమాదేవిగారు అక్కడకి వచ్చారు. ఇద్దరం ఒకళ్ళకి ఒకళ్ళం పరిచయం చేసుకున్నాము. ఆ సందర్భంలో పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరిలో వుంటున్నారని చెప్పారు. నాకు అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదులో వుంటున్నారని తెలిసినా ఎక్కడ వున్నారో తెలియదు. నేను మహాత్ముని సన్నిధిలో సంకల్పం చేసుకుని పారాయణ చేసుకున్నాను కనుక,

నాతో మాట్లాడే గురువుగారిని ఇచ్చిన నాంపల్లి బాబాగారికి ప్రణామాలర్పించి మల్కాజిగిరికి చేరుకున్నాను.

పూజ్యశ్రీ అమ్మగారికి భూత భవిష్యత్ వర్తమానాలు సగోచరమే అన్నది నాకు ఈ విధంగా అనుభవం. 2008 సంవత్సరంలో పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరిలో ఉండేవారు. నాకు మంచి ఉద్యోగం కావాలని మనసులోనే కోరుకున్నాను. వారి ఆశీస్సులతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇన్ని కంపెనీలు ఉండగా ఈ కంపెనీలోనే ఎందుకు వచ్చిందా అని అనుకునేవాడిని. తర్వాత పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరి నుండి నాగోలు తరలి వెళ్లారు. నేను అప్పట్లో కూకట్-పల్లి లో ఉండేవాడిని. నాగోలు సుమారు అక్కడి నుండి 35 కిలోమీటర్లు. అక్కడ నుండి అప్పుడప్పుడు శని ఆదివారాల్లో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వచ్చి వెళ్తుండే వాడిని. చాలా దూరం అయింది. అంతేకాక ట్రాఫిక్ వల్ల తరచుగా వెళ్ళలేక పోయినందుకు బాధపడే వాడిని. అనూహ్యంగా 2010వ సంవత్సరంలో మా ఆఫీస్ కొత్త బ్రాంచ్ నాగోలు దగ్గరలో పోచారం లో ఏర్పాటు చేశారు. నేను 2011లో నాగోలులో నివాసం ఏర్పాటు చేసుకుని తరుచుగా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకోగలిగాను.

జన్మనిచ్చిన తల్లి నవమాసాలు మోసి కని పెంచుతుంది. బిడ్డ పెరిగి పెద్దవాడై అయ్యేవరకూ తండ్రి కాపాడుతాడు. కానీ సద్గురువు జీవితాంతం, జీవితానంతరం కూడా తోడుగా ఉండి కాపాడుతారు. పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు ప్రచారంలో భాగంగా మేము ప్రతి గురువారం శ్రీ సాయిబాబా గుడిలో గ్రంథాల ప్రదర్శన, అమ్మకాలు చేస్తుండేవారము. వచ్చినవారికి పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి, వారి గ్రంథాల విశిష్టత గురించి వివరిస్తూ ఉండేవాళ్ళం. గ్రంథాల స్టాల్ లో కూర్చున్నప్పుడు అటు ఇటు పూజ్యశ్రీ మాస్టరుగారు పూజ్యశ్రీ అమ్మగారు ఇరువైపులా ఉన్నట్లు భావన చేసేవాడిని. అప్పుడప్పుడు వారు నిజంగా ఉన్నట్లు అనుభవం అయ్యేది. అలాగే బస్సులో ప్రయాణం చేసే సమయంలో పక్కన పూజ్యశ్రీ మాస్టరుగారు లేదా పూజ్యశ్రీ అమ్మగారు ఉన్నట్లు భావన చేస్తూ ఉండేవాడిని. చాలాసార్లు బస్ మొత్తం నిండి పోయినా నా పక్కన ఎవరు కూర్చునేవారు కాదు. నేను నా ప్లేస్ లో చాలా ఒదిగి కూర్చున్నా, పక్కన మనిషి స్థలం ఉన్నా ఎవరు కూర్చోకపోవడం ఎంతో చిత్రం.

ఆర్తత్రాణ పరాయణులు పూజ్యశ్రీ అమ్మగారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో అమ్మగారి చర్యలు కడుసరళంగా ఉంటాయి. ఎవరైనా ఆపదలో ఉన్నవారు వచ్చి బాధలు చెప్పు కున్నప్పుడు "ఆ బాగుంటుంది" లాంటి చిన్న పదాలు వాడేవారు. కొంతమందికి కొన్ని పారాయణలు చెప్పేవారు. విచిత్రంగా వారి సమస్యలు పరిష్కారం అయ్యేవి. మా నాన్నగారు 2005లో ప్రమాదంగా బ్రెయిన్ ఎటాక్ అయ్యి హాస్పటల్లో ఉన్నప్పుడు

గురు బంధువుల ద్వారా అమ్మగారి నుండి ఆశీస్సులు తీసుకున్నాను. ప్రాణాపాయం నుండి మా నాన్నగారు కోలుకున్నారు. మా పెద్దబ్బాయి మనంత 3 యేండ్ల వాడిని యాక్సిడెంట్ నుంచి తృటిలో తప్పించారు. అలాగే నాకు, నా కుటుంబంలోని వారికి కరోనా వచ్చినప్పుడు అమ్మగారి ఆశీస్సులతో అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువ ఇబ్బందులతో బయట పడవేశారు.

పూజ్యశ్రీ అమ్మగారు పేదవారికి, ఆపదలో ఉన్నవారికి ధనరూపంలో, వస్తురూపంలో సహాయం చేస్తుండేవారు. చలికాలం రోడ్డు పక్కన ఉండేవారికి దుప్పట్లు పంచిపెట్టించేవారు, ఎండాకాలం చలివేంద్రం పెట్టించేవారు. చలివేంద్రంలో కేవలం మంచి నీరే కాకుండా ఇంటికి వచ్చిన అతిధిని ఎలా చూసుకుంటామో అలా వచ్చిన వారికి తరవాణి, మజ్జిగ, పానకం మొదలయినవి ఏర్పాటు చేయించేవారు. వచ్చినవారు అవి తాగి తృప్తిగా వెళ్లేవారు. పూజ్యశ్రీ అమ్మగారు త్రికరణశుద్ధిగా సేవ ఎలా చేయాలో నేర్పించేవారు.

పూజ్యశ్రీ అమ్మగారి చేత విరచితమైన రాత్రి ప్రార్థనలో ఇలా ఉంటుంది "మీసేవ చేసుకునేందుకు అవసరమైన శారీరక మానసిక పరిస్థితులను పరిసరాలను ప్రసాదించిన మీకు మా కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు". పూజ్యశ్రీ అమ్మగారు భక్తుల యొక్క సత్సంకల్పాలను తెలుసుకొని తగిన విధంగా పరిస్థితులను కల్పించడంలో దిట్ట. నేను నా వివాహానికి ముందు నాకున్న చిన్నపాటి భక్తికి అడ్డంకి రాని అమ్మాయితో వివాహం కలగాలని కోరుకునేవాడిని. ఒకసారి పెళ్లిచూపులు అయిన తర్వాత ఫోటోని అమ్మగారికి చూపించి "ఎలా ఉంటుంది, అమ్మగారు" అని అడిగాను. అమ్మగారు "లక్షణంగా ఉంది" అని అన్నారు. తర్వాత ఆమెతోనే నా వివాహం అవడం, నా భార్య సుప్రియకు ఇంతకు ముందు బాబా సాంప్రదాయం ఏమీ తెలియకపోయినా మా పెళ్లి అయిన తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసుకొని శ్రీసాయిబాబా, పూజశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల భక్తిభావం పెంచుకొని నాకు ఎల్లప్పుడూ సహకారిగా ఉండటం నిజంగా పూజశ్రీ అమ్మగారి అనుగ్రహానికి నిదర్శనం.

చిన్న చిన్న విషయాల్లో కూడా పూజ్యశ్రీ అమ్మగారు మన వెంట నుండి నీడలా కాపాడుతారు అని చాలాసార్లు నా విషయంలో నిరూపణ అయింది. అప్పట్లో ప్రచారంలో భాగంగా గ్రంథాలు పంచేవాడిని. నేను



పారాయణ చేసే గ్రంథంపై పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులు వ్రాయించుకోవాలని అనిపించేది. కానీ కుదరలేదు. ఒకసారి శ్రీగురుచరిత్ర గ్రంథాలు పంచడం కోసమని చాలా తీసుకున్నాను. వాటన్నిటిని సర్ది పెడుతుండగా ఒక పేజీ గాలికి ఎగిరింది. ఆ పేజీలో ఏవో అక్షరాలు కనిపించాయి. తీసి చూస్తే పూజ్యశ్రీ అమ్మగారు ఆశీస్సులు వ్రాసి క్రింద సంతకం పెట్టి వున్నారు!!! అది చూడగానే ఆనందంతో నా కళ్లు చెమర్చాయి - పూజ్యశ్రీ అమ్మగారు నా మనసులో వున్న కోరికను అలా తీర్చారు.

ఒకసారి నేను పారాయణ గ్రంథాలు ఊరిలో పంచడానికి నిమిత్తం తీసుకువెళ్దామని గ్రంథాలన్నీ ప్యాక్ చేసుకున్నాను సికింద్రాబాదులో రాత్రి 9 గంటలకు ట్రైన్ ఎక్కవలసి ఉంది నేను కూకట్ పల్లి నుండి సిటీబస్సులో రైల్వే స్టేషన్ చేరటానికి కనీసం ఒక గంట సమయం పడుతుంది. ఆఫీసులో పని కారణంగా లేట్ అయింది. రాత్రి 8 గంటల 20 నిమిషాలకు సిటీ బస్ స్టాప్ చేరుకున్నాను. ఎలాగైనా ట్రైను అందుకోవాలని అమ్మగారిని ప్రార్థించాను. మెల్లగా గాలి వర్షం ప్రారంభమైంది. 5 నిమిషాల్లో వర్షం

పెద్దదయింది. నా బస్సు వచ్చింది. రోడ్లన్నీ వర్షం వలన చాలావరకు ఖాళీ అయ్యాయి. కేవలం బస్సులు, కొన్ని కార్లు మాత్రమే వెళుతున్నాయి. సాధారణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకోవడానికి గంట సమయం పడుతుంది. కానీ ఆరోజు కేవలం అర్ధగంటలో చేరుకున్నాను. నేను పరిగెత్తి ట్రైన్ ఎక్కి కూర్చున్నాను. అప్పుడు రైలు కదిలింది. పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పుకున్న ప్రార్థన ఫలించింది.

శ్రీ ద్వారకబాబుగారి వివాహ నిశ్చితార్థం కాకముందు, ఇంకా ఎవ్వరికీ ఈ విషయం తెలియక ముందు, పూజ్యశ్రీ అమ్మగారు నాకు స్వప్నంలో లయమ్మగారిని చూపించి "ఈ అమ్మాయి మా కోడలు" అని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. అలాగే తీర్థచరణ్ కి మూడు లేక నాలుగు సంవత్సరాల వయస్సులో అతనికి చెల్లి పుట్టినట్లు, తననెవరూ పట్టించుకోవటం లేదని గొడవ చేస్తున్నట్లు నాకు కల వచ్చింది. 5-6 సంవత్సరాల క్రితం ఒక స్వప్నం వచ్చింది. అందులో పూజ్యశ్రీ అమ్మగారికి బాగా అనారోగ్యం వచ్చి ఆసుపత్రిలో చేర్చారట. అందరూ బాగా ఆందోళన పడుతున్నారట! మెలుకువ వచ్చాక నాకు చాలా బాధేసింది. భయమేసింది. కానీ రెండు, మూడు రోజుల తరువాత పూజ్యశ్రీ అమ్మగారు మళ్ళీ స్వప్న దర్శనమిచ్చారు. అందులో ఆమె బాగా ముసలివారుగా వున్నారు. తెల్లచీర కట్టుకుని కూర్చుని వున్నారు. అంటే శరీరం అంతా ఆనందమయి మాత లాగా వున్నది. కానీ ముఖం మాత్రం పూజ్యశ్రీ అమ్మగారిది! అప్పుడు నాకు చాలా ధైర్యం వచ్చింది, పూజ్యశ్రీ అమ్మగారికి ఏమీ కాదని! చాలాకాలం మనతో వుంటారనిపించింది. నిజంగానే కొన్నాళ్ళకి పూజ్యశ్రీ అమ్మగారికి అనారోగ్యం చేయడం, ఆసుపత్రిలో చేరటం జరిగింది. అందరూ భయపడుతున్నా నేను మాత్రం భయపడలేదు. అనుకున్నట్లుగానే పూజ్యశ్రీ అమ్మగారు క్షేమంగా తిరిగి వచ్చారు!

పూజ్యశ్రీ అమ్మగారు అతి క్లిష్టమైన ఆధ్యాత్మిక విషయాలను అతి సరళమైన భాషలో వివరించడం వారిచే రచించబడిన వివిధ వ్యాసాలలోను, వారు ప్రవచించిన వివిధ అనుగ్రహభాషణలలోను చూడవచ్చు. ఉదాహరణకు వారిచే రచించబడిన 'నాకేం కావాలి' అనే వ్యాసంలో "మనకు ఏం కావాలి?" అనే విషయాన్ని ఈ విధంగా ఒక ఉదాహరణతో అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పారు:- "కోరుకున్న ఉద్యోగమే కావాలి. అలాగే మనం కోరుకున్నట్లుగానే భర్త, లేక భార్య, ఇల్లు, వాకిలి ఇవన్నీ కావాలి. అలా ఉండకపోతే అసంతృప్తి చెందుతాము. అంటే మనకు ఏదైనా ఉంటే సరిపోదు, మనం కావాలి అనుకున్నట్టే కావాలి".

పూజ్యశ్రీ అమ్మగారు కోరికలు తీర్చే కొంగు బంగారం, ఆర్తులు బాధలు తీర్చే అనఘా దేవి, సాధకులకు సద్గురువు, లోకానికి జగద్గురువు.●

మాతృదేవి దివ్య సన్నిధిలో నిత్యసేవలు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ మహాసమాధి మందిరము "మాతృదేవి దివ్య సన్నిధి" లో ప్రతి నిత్యము జరుగుచున్న నిత్యసేవలలో వివిధ ఊర్ల నుంచి భక్తులు బృందాలుగా వచ్చి సేవలు చేసుకుంటూ ఎంతో శాంతిని అనుభవిస్తూ; ఆ దివ్యసన్నిధిలోనూ, తిరిగి ఇంటికి వెళ్లిన తరువాతనూ ఎన్నో అనుభవాలను కూడా పొందుతున్నారు.

పూజ్యశ్రీ అమ్మగారు భౌతికంగా మన మధ్య ఉన్నప్పుడు, నిత్యమూ పూజ్యశ్రీ మాస్టరుగారికి, శ్రీ సాయినాధునికి ఏ సేవ ఏ సమయానికి ఎలా చేసేవారో శ్రీ ద్వారకబాబుగారు తెలియజేశారు. అలా బాబుగారు చెప్పిన ప్రకారమే 'మాతృదేవి దివ్యసన్నిధి' లో కూడా మనమందరం సేవ చేసుకొనేలాగా ఏర్పాటు చేసారు. అదే విధముగా అన్ని బృందాల వాళ్ళు చేసుకుంటున్నారు.

గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి సన్నిధిలో సేవలు చేసుకునే విధానాన్ని ఇంకా ఈవిధంగా వివరించారు:

"సన్నిధిలో సేవలు ఎంతో చక్కగాను, భావంతోనూ జరగాలి. అందరికి సేవచేసుకునే అవకాశం రావాలి. అంతేకాక మన తరువాత తరాల వారికి కూడా ఈ విధానం అలవడాలి.

కొందరి మహాత్ముల ఆశ్రమాలలో దానికి సంబంధించిన సన్యాసులే సేవ చేస్తారు, కొన్ని పుణ్యక్షేత్రాలలో సేవలకు పూజారులను నియమిస్తే, భక్తులు దర్శనం చేసుకుని వెడతారు. ఇంకొన్ని చోట్ల సేవలకు వ్యక్తులని నియమించడమే కాకుండా, సేవకులు కూడా వచ్చి సేవ చేసుకుంటారు!

మనం కూడా ఒక పూజారిని నియమించి సేవలు చేయించవచ్చు. అప్పుడు మనం దర్శన

భక్తులం మాత్రమే అవుతాం. అలా కాకుండా 'సేవ' అన్నది భక్తులదే అవ్వాలని నా ఉద్దేశం. లేకపోతే మహాత్ములని సేవించి తరించే సంప్రదాయాన్ని జారవిడుచుకున్న వాళ్ళమవుతాము.

ఆలయాలలో ప్రాణప్రతిష్ట చేసిన విగ్రహాలే అంతటి శక్తివంతం అయినప్పుడు, తమ జీవితమంతా సకల చరాచర సృష్టితో తాదాత్మ్యం చెంది ఆత్మనిష్ఠలో నిలిచిన మహాత్ముల సమాధుల దగ్గర ఇంకెంతటి శక్తి ఉంటుందో కదా! అందువల్ల మనం సేవచేసుకునేటప్పుడు, ఎంతటివారికి సేవ చేస్తున్నామో వారి విశిష్టత తెలిసి సేవచేసుకోవాలి!

మనము ఇళ్లలో మొదలుపెట్టే ప్రతి కార్యక్రమానికి ముందు భగవంతునికి, లేక మహాత్ములకి శారీరకముగా, మానసికముగా సేవచేసుకోవాలి. అలా రావాలంటే మనందరికీ సేవ అనే విద్య పూర్ణంగా వచ్చివుండాలి. అలా వచ్చిననాడు మాత్రమే పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి చక్కగా సేవచేసుకోగలుగుతాం. అప్పుడు సశరీరంగా వున్న మహాత్ములకి సేవచేసుకోవడం కూడా తెలుస్తుంది. కనుక ఇది ఒక సాంప్రదాయం కావాలి, అమ్మగారి సన్నిధి ఒక గొప్ప సాధనా క్షేత్రం అవ్వాలి."

'మాతృదేవి దివ్యసన్నిధి' లో జరుగుతున్న నిత్యసేవలు ఈ విధంగా వున్నాయి.

ఉదయ సేవలు

5:30 కి పూజ్య అమ్మగారి మేలుకొలుపు,
పూజ్య మాస్టరుగారి మేలుకొలుపు.
6:00 కి ఆరతి; ఉదయ ప్రార్థన.
6:50 కి కాఫీ నివేదన.
7:30 కి పూజ్య అమ్మగారి అభిషేకం.
8:00 కి అలంకరణ.
8:30 కి అల్పాహార నివేదన,
తదుపరి ప్రసాద వినియోగం.
9:30 కి పూజ.
11:00 కి గ్రంథపఠన.

మధ్యాహ్న సేవలు

12:00 కి ఆరతి.
12:30 కి నివేదన,
తదుపరి ప్రసాద వినియోగం.

సాయంత్రపు సేవలు

4:00 కి కాఫీ నివేదన.
5:00 కి అలంకరణ విసర్జన.
6:00 కి ఆరతి.
6:30 కి గ్రంథ పఠన.
7:00 కి భజన.
7:30 కి నివేదన,
తదుపరి ప్రసాద వినియోగం.

రాత్రి సేవలు

9:00 కి ఆరతి.
9:30 కి పూజ్య మాస్టరుగారి పవళింపు సేవ,
పూజ్య అమ్మగారి పవళింపు సేవ.

మన తెలుగు రాష్ట్రాలలోనేకాక, దేశవిదేశాలలో ఉన్న భక్తులు ఎవరైనాసరే సేవ చేసుకోవటానికి రావచ్చును. పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధిలో సేవ చేసుకునే వారి కొరకు ఉచిత వసతి, భోజనప్రసాద సదుపాయములు కలవు. సేవకు రాదలచుకున్నవారు మరిన్ని వివరముల కొరకు 7893548748 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించగలరు.

భక్తులందరూ ఈ మహదవకాశాన్ని సద్వినియోగ పరచుకుని ఐహిక ఆధ్యాత్మికోన్నతి పొందగలరు.

జై సాయి మాస్టర్!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

శ్రీ సాయిలీలామృతం-శ్రీ గురుచరిత్ర	450-00
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర	90-00
శ్రీ సాయి లీలామృతము	99-00
శ్రీ గురు చరిత్ర	99-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రబోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్తవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము-భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	50-00
ఏది నిజం?	50-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహాత్మ్యం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి-ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాల స్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి)	49-00
మనము-మన సంస్కృతి	70-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master(Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2)	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాస్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba(Hindi)	150-00
Sai Leelamrutham(Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham(Malayalam)	220-00
Sai Baba Leelamrutham(Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	99-00
Sri Guru Charitra (Kannada)	45-00
Shiridi Aarathi(Tamil)	15-00
Stavana Manjari(Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra(Kannada)	55-00
Sri Sainatha Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, Sri Manga Bharadwaja Trust,

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad -500068
Phone : 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dt., Andhra Pradesh - 523002
Phone: 08592 233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad OR Ongole.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోగల గుమ్మళంపాడు గ్రామ శివారులో
సమాధిస్థితులైవున్న మాతృదేవి దివ్యసన్నిధి

మాతృదేవిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం త్వరితగతిన నిర్మాణం జరుగుతున్న
'భక్త నివాస్' భవన సముదాయము